ప్రజాశక్తి

శుక్రవారం 14 జులై 2023 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా





కోటేశ్వరరావు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న సిఐటియు, సిపిఎం నేతలు

ప్రజానేత ఆర్‌కె

- పలువురు నేతల నివాళి
- సిపిఎం, సిఐటియు ఉద్యమాల్లో కీలకపాత్ర
- నేడు అంత్యక్రియలు

ప్రజాశక్తి-విజయవాడ : సిపిఎం విజయవాడ సీనియర్ నాయకులు ఆర్.కోటేశ్వరరావు గురువారం ఆకస్మికంగా మృతి చెందడంతో పార్టీ, కార్మిక, ప్రజా సంఘాల నేతలు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. జీవితాన్ని ప్రజా ఉద్యమాలకు అంకితం చేసిన ఆర్‌కె ప్రజానేత అని కొనియాడారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో నివాసం ఉంటున్న ఆయన చిన్న కుమార్తె రాజ్యలక్ష్మి ఇంటికి రెండు రోజుల క్రితం ఆర్‌కె, ఆయన భార్య సరోజనీ వెళ్లారు. కుమార్తె డ్యూటీకి వెళ్లిన తర్వాత కొద్దిగా గుండెలో నెప్పిగా ఉందని, జ్యూస్ తీసుకురావాలని మనవడికి చెప్పారు. అతను బజారుకెళ్లి ఐదు నిమిషాల్లో ఇంటికి తిరిగి వచ్చి చూసేలోపు ఉలుకుపలుకు లేకుండా ఇంట్లో పడిఉన్నారు. వెంటనే స్థానిక పార్టీ నాయకులకు విషయం తెలపడంతో వారు వచ్చి ఎన్‌ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మరణించినట్లు ధృవీకరించారు. దీంతో ఆర్‌కె భౌతికకాయాన్ని పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులు మంగళగిరి నుంచి విజయవాడ దుర్గాపురం రజకవీధిలోని ఆయన స్వగృహానికి తరలించారు. ఆయనకు భార్య, కుమారుడు నాగమల్లేశ్వరరావు, ఇద్దరు కుమార్తెలు మణి, రాజ్యలక్ష్మి ఉన్నారు. 1949 జూలై 1వ తేదీన గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం పేరికలపూడిలో వెంకయ్య, వెంకమ్మ దంపతులకు ఆయన జన్మించారు. ముగ్గురు సోదరులు, ఐదుగురు సోదరీమణుల నడుమ ఏడో సంతానంగా పుట్టారు. ఐటిఐ విద్యనభ్యసించిన ఆర్‌కె... 1966లో ఎపిఎస్ ఆర్‌టిసి విజయవాడ మెయిన్‌డిపో వర్క్‌షాపులో ఉద్యోగంలో చేరారు. 2007లో ఉద్యోగ విరమణ చేశారు. 1070లో ఎపిఎస్ ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్)లో సభ్యుడిగా చేరిన కోటేశ్వరరావు ఫెడరేషన్ వ్యవస్థాపక సభ్యునిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యదర్శిగా పదేళ్లకుపైగా బాధ్యతలు నిర్వర్తించారు. ఫెడరేషన్‌లో చేరిన దగ్గర నుంచి ఉద్యోగ విరమణ చేసే వరకు ఆర్‌టిసి యాజమాన్య ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలపైనా, సంస్థ పరిరక్షణకు జరిగిన అనేక ఉద్యమాలకు ప్రత్యక్షంగా నాయకత్వం వహించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షులుగా కూడా పనిచేశారు. 1975 నుంచి సిపిఎం సభ్యులుగా, విజయవాడ నగర ఉమ్మడి కమిటీ సభ్యునిగా ఉన్నారు. ప్రస్తుతం సీనియర్ సభ్యునిగా కొనసాగుతున్నారు. అటు ఫెడరేషన్లో, ఇటు పార్టీ ఉద్యమాల్లో కోటేశ్వరరావు చురుకైనా పాత్ర పోషించారు. ఇటీవల పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు చేపట్టిన 'పోలవరం పోరుకేక మహా పాదయాత్ర' విజయవాడ వచ్చిన సందర్భంలోనూ పాదయాత్ర బృందానికి భోజన సౌకర్యాలు ఏర్పాటు చేయడంలోనూ కీలకంగా వ్యవహరించారు. దుర్గాపురం ఇళ్ల స్థలాల సమస్య, టిడిపి ప్రభుత్వ హయాంలో సాగిన విద్యుత్ ఉద్యమంలో కూడా ఆర్‌కె చురుకైన పాత్ర పోషించారు. దుర్గాపురం రజక వీధిలోని స్వగహం వద్ద (మిగతా 6లో)

నీటి మునిగిన పొలాలు

జిల్లాలో సగటున 42.5 మిమీ వర్షపాతం నమోదు

రహదారులపై మోకాలి లోతులో నీరు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

భారీ వర్షాలు రైతులను నిలువునా ముంచుతున్నాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం 11 గంటల వరకు కృష్ణాజిల్లాలో 1063.20 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. సగటు వర్షపాతం 42.5 మిల్లీమీటర్లుగా ఉంది. అత్యధికంగా నాగాయలంక మండలంలో 133.8 మిమీ, అత్యల్పంగా పెనమలూరులో 1.8 మిమీ వర్షపాతం నమోదైంది. దీంతో జిల్లాలోని పలు మండలాల్లో వరి నారుమళ్లు, వెద పద్ధతిలో సాగైన వరి నీట మునిగింది. మచిలీపట్నం పెడనల్లోని పలు పల్లపు ప్రాంతాల రహదారులపైకి భారీగా నీరు చేరింది.

మునిగిన నారుమళ్లు

భారీ వర్షాలతో జిల్లాలోని ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి, మొవ్వ, పెడన, గూడూరు, బందరు తదితర ప్రాంతాల్లో డ్రయిన్లు, కాల్వల్లో నీరు ఎగదన్నింది. వర్షం నీటితోపాటు కాల్వలు, డ్రయిన్లలో నీరు పంట పొలాల్లోకి చొచ్చుకువచ్చింది. దీంతో ఆయా మండలాల్లో వెద పద్ధతిలో సాగవుతున్న వరి, వరి నారుమళ్లు (నర్సరీ) నీట మునిగాయి. నీట మునిగిన పంటలను రక్షించుకునేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. పొలాల్లోకి చేరిన నీటిని తిరిగి కాల్వల్లోకి మళ్లిస్తున్నారు.

ముంపులో రహదారులు

భారీ వర్షానికి బందరు నగరం, పెడన పట్టణంలో డ్రయిన్లు పొంగాయి. రహదారులపైకి మోకాలిలోతులో నీరు చేరింది. సుందరయ్య నగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, లక్ష్మీ టాకీస్ సెంటర్ ఎదురుగా బైపాస్ రోడ్డు, బస్టాండ్, రేవతి సెంటర్ తదితర ప్రాంతాల్లో సాయంత్రం వరకు నీరు రహదారులపైనే నిలిచి ఉంది. దీంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. జిల్లాలో మండలాలవారీగా నమోదైన వర్షపాతం మిమీ మీటర్లలో నమోదైన వివరాలిలా ఉన్నాయి. నాగాయలంక 133.8, పెడన 133.2, కోడూరు 96.8, మొవ్వ 89.8, అవనిగడ్డ 83.6, మచిలీపట్నం 82.6, మోపిదేవి 76.4, గూడూరు 71.2, పమిడిముక్కల 47.6, ఘంటసాల 35.2, గుడ్లవల్లేరు 19.8, పామర్రు 18.8, పెదపారుపూడి 15.8, గుడివాడ 15.2, కృత్తివెన్ను 12.2, నందివాడ 9.6, ఉయ్యూరులో 5.8, కంకిపాడు 5.6, బంటుమిల్లి 5.4, ఉంగుటూరు 3.8, గన్నవరం 3.2, బాపులపాడు 2.8, తోట్లవల్లూరు 2.6, పెనమలూరు 1.8.

రాష్ట్రపతి అవార్డుకు డాక్టర్ సమరం ఎంపిక

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, వివిధ సామాజిక కార్యక్రమాలను నిర్వహిస్తూ విశేష సేవలు అందిస్తున్న డాక్టర్ జి.సమరం రాష్ట్రపతి అవార్డుకు ఎంపిక కావ డం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు అన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ డా జి.సమరంకి ఈ నెల 17వ తేదీన న్యూఢిల్లీ రాష్ట్రపతి భవన్లో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్వర్ణ పతకం ప్రదానం చేయనున్నారు. న్యూఢిల్లీ రాష్ట్రపతి భవన్లో జరిగే కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వార్షిక సమావేశంలో డా.జి. సమరంకి ఇండియన్ రెడ్ క్రాస్, ఆయన చేసిన సామాజిక సేవలకు గుర్తింపుగా రాష్ట్రపతి ఈ అవార్డు ప్రదానం చేయనున్నారు.





గణనీయంగానే రిజిస్ట్రేషన్లు

- ఎన్‌టిఆర్ జిల్లాలో రూ.774 కోట్ల ఆదాయం
- స్టాంప్ డ్యూటీ కింద మరో రూ.563 కోట్లు రాక

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

జిల్లాల పునర్విభజన అనంతరం నూతనంగా ఏర్పడిన ఎన్టీఆర్ జిల్లాలో గణణీయంగానే రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి. 2022 ఏప్రిల్ 4న నూతనంగా ఎన్టీఆర్ జిల్లా ఏర్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వందల కోట్లల్లో ప్రభుత్వానికి రెవెన్యూ సమకూరింది. రాష్ట్రంలో మిగిలిన జిల్లాలకు ఏమాత్రం తక్కువ కాకుండా భారీగానే రిజిస్ట్రేషన్లు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరం లో జిల్లా వ్యాప్తంగా (మిగతా 6లో)

పెడన మున్సిపల్ చైర్‌పర్సన్‌గా నాగకుమారి ఎన్నిక

- మచిలీపట్నం డిప్యూటీ మేయర్లుగా విజయలక్ష్మి, నాగ కుసుమ
- వత్సవాయి ఎంపిపిగా రమాదేవి



రమాదేవిని అభినందిస్తున్న ఎంఎల్‌ఎ సామినేని




డిప్యూటీ మేయర్లు

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్, పెడన, వత్సవాయి : కృష్ణా, గుంటూరు జిల్లాల్లో గురువారం పలువురు ప్రజాప్రతినిధుల ఎన్నిక జరిగింది. మచిలీపట్నం నూతన డిప్యూటీ మేయర్లుగా మాడపాటి విజయలక్ష్మి, శీలం భారతీ నాగ కుసుమ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ వారికి ధృవపత్రాలను అందించారు. మాజీ మంత్రి, బందరు ఎంఎల్ఎ పేర్ని నాని నూతనంగా ఎన్నికైన డిప్యూటీ మేయర్లను అభినందించారు. అలాగే ముందుగా జరిగిన ఒప్పందం మేరకు రెండున్నరేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేస్తుకున్న మచిలీపట్నం మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ తన పదవికి రాజీనామా చేశారు. ఆమె రాజీనామాను కౌన్సిల్ ఆమోదించింది. కాగా, పెడన మున్సిపల్ నూతన చైర్‌పర్సన్‌గా కటకం నాగకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తొలుత పెడన పురపాలక సంఘం మాజీ చైర్‌పర్సన్ బళ్లా జ్యోత్నరాణి 7వ వార్డు కౌన్సిలర్ కటకం నాగ కుమారిని నూతన చైర్ పర్సన్ అభ్యర్థిగా ప్రతిపాదించగా, 19వ వార్డు కౌన్సిలర్ సిరివెళ్ల జయేష్ బలప రిచారు. దీంతో నాగ కుమారి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన మచిలీపట్నం ఆర్డిఓ ఐ.కిషోర్ ప్రకటించారు. అనంతరం జరిగిన ప్రమాణస్వీకారంలో రాష్ట్ర గహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ పాల్గొన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా వత్సవాయి ఎంపిపిగా కొలుసు రమాదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతంలో ఎంపిపిగా ఉన్న చెంబేటి వెంకటేశ్వర్లు అకాల మరణంతో ఎన్నికైన నూతన ఎంపిపిని రామాదేవిని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ సామినేని ఉదయ భాను అభినందించారు.



విజయవాడకు బి.ఎస్.రావు భౌతికకాయం తరలింపు



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : హైదరాబాద్‌లో గురువారం మధ్యాహ్నం కన్నుమూసిన శ్రీచైతన్య విద్యాసంస్థల అధినేత డాక్టర్ బొప్పన సత్యనారాయణరావు (బి.ఎస్.రావు) భౌతిక కాయాన్ని రాత్రి విజయవాడ సమీపంలోని తాడిగడపకు తరలించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు సీమా, సుష్మా ఉన్నారున. విదేశాల్లో ఉన్న సీమ వచ్చిన తర్వాత అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. గుంటూరు వైద్య కళాశాలలో విద్యనభ్యసించిన బీఎస్ రావు.. ఇంగ్లాండ్, ఇరాన్లలో 15 ఏళ్ల పాటు వైద్యుడిగా సేవలందించారు. అనంతరం భార్య డాక్టర్ ఝూన్సీ లక్ష్మీబాయితో కలిసి 1986లో శ్రీ చైతన్య విద్యాసంస్థలను స్థాపించారు. తొలుత విజయవాడ సమీపంలోని పోరంకిలో బాలికల జూనియర్ కళాశాలను స్థాపించారు. తొలుత 56 మంది విద్యార్థులతో ప్రారంభమైన శ్రీ చైతన్య విద్యా సంస్థల ప్రస్థానం దేశవ్యాప్తంగా సుమారు 8.5 లక్షల మంది విద్యార్థులకు విద్యనందించే స్థాయికి చేరింది. ఈ విద్యా సంస్థల ఆధ్వర్యాన మొత్తం 321 జూనియర్ కళాశాలలు, 322 శ్రీ చైతన్య టెక్నో స్కూళ్లు, 107 సిబిఎస్ఇ స్కూళ్లను నడుపుతున్నారు.

సిఐటియు చొరవతో ఐఒసిఎల్ ఎల్‌పిజి ప్లాంట్లో వేతన ఒప్పందం



ప్రజాశక్తి ఇబ్రహీంపట్నం : కొండపల్లి ఐఒసిఎల్ ఎల్‌పిజి ప్లాంట్‌లో పెండింగ్ ఉన్న నూతన వేతన సవరణ ఒప్పందంతో ఇటీవల అనేక సమస్యలు ఏర్పడ్డాయి. దీంతో కాంట్రాక్ట వర్కర్స్ తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యారు. దీనిని గమనించిన కార్మికులు, కాంట్రాక్ట వర్కర్స్‌కి తక్షణమే న్యాయం జరిగేందుకు సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో పోరాటానికి సిద్ధపడ్డారు. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో ఉన్న డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ డి.శ్రీనివాసులును కలిసి అభ్యర్ధన పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఐఒసిఎల్ ఎల్‌పిజి ప్లాంట్ యాజమాన్యం, హెచ్‌ఆర్ స్కేర్ కాంట్రాక్టర్ (హౌస్ కీపింగ్, హ్యాండిలింగ్), సన్ రైజ్ కాంట్రాక్టర్ (ఎలక్ట్రీషియన్స్) కీ, రెండు దఫాలుగా చర్చలు జరిపారు. 12న నూతన వేతన ఒప్పందంపై (ఎంఒయు) గ్యాస్, ఆయిల్ సెక్టార్ వర్కర్స్ యూనియన్, సిఐటియు చొరవతో హైదరాబాద్, విద్యా నగర్, డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ సెంట్రల్ డి.శ్రీనివాసులు సమక్షంలో ప్లాంట్ యాజమాన్యం తరుపున కొండపల్లి చీఫ్ ప్లాంట్ మేనేజర్ బి రామారావు, చీఫ్ మేనేజర్ హెచ్ ఆర్ రవి శంకర్, కాంట్రాక్టర్స్ హెచ్ ఆర్ స్కేర్ సంస్థ ఆపరేషనల్ మేనేజర్ యం హదయ్ రాజు, సన్ రైజ్ కాంట్రాక్టర్ సంస్థ డైరెక్టర్ యం.ఎస్.ప్రకాష్ రావు, ఐఒసిఎల్ ఎల్‌పిజి ప్లాంట్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సిఐటియు తరుపున యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎం.మహేష్, ప్రెసిడెంట్ జి.దావీదు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.సిహెచ్.శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ వెంకట్రావు, కమిటీ సభ్యులు సిహెచ్.మల్లిఖార్జున తదితరుల ప్రతినిధి బందం చర్చించి సంతకాలు చేశారు. నూతన వేతన ఒప్పందం 2023 ఏప్రిల్ 1 నుంచి 2028 మార్చి 31 వరకు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ వేతన ఒప్పందం కొండపల్లి ప్లాంట్‌తో పాటు కడప, రామగుండం ప్లాంట్‌లకు కూడా వర్తించనున్నట్లు తెలిపారు. కార్మికుల ఐక్యత వలననే నూతన వేతన ఒప్పందం సాధ్యమైందని ఐఒసిఎల్ ఎల్‌పిజి ప్లాంట్ కాంట్రాక్టు వర్కర్స్ ఐక్యతతో నూతన వేతన ఒప్పందం జరిగిందని సిఐటియు మండల కార్యదర్శి యం.మహేష్ అన్నారు.

వత్సవాయి నూతన ఎంపిపిగా రమాదేవి

ప్రజాశక్తి వత్సవాయి : వత్సవాయి ఎంపీపీ కొలుసు రమాదేవి పార్టీ అభివృద్ధికి కషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ సా మినేని ఉదయభాను అన్నారు. గురువారం వత్సవాయి మండల పరిషత్ కార్యాలయంలో వత్సవాయి మండల నూతన ఎంపీపీగా కొలుసు రమాదేవి ఎంపికయ్యారు. గతంలో పనిచేసిన అధ్యక్షులు చెంబేటి వెంకటేశ్వర్లు అకాల మరణం చెందడంతో ఆంధ్రప్రదేశ్ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గురువారం నాడు మండల పరిషత్ కార్యాలయంలో అధ్యక్ష ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ సభ్యులు ఏకగ్రీవంగా వత్సవాయి ఎంపిటిసి 2 సభ్యురాలైన కొలుసు రమాదేవిని ఎన్నుకున్నారు. అనంతరం ఎంపీపీ సన్మాన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవిప్ శాసనసభ్యులు సామినేని ఉదయభాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ సీనియర్ నాయకులు వత్సవాయి మండలం ఎంపీపీ చంబెటి వెంకటేశ్వర్లు మరణానంతరం నూతన ఎంపీపీగా ఎన్నికైన కొలుసు రమాదేవి మండలానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. రమాదేవి మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఎంపీపీగా ఎన్నికచేసినందుకుసర్కార్, సామినేని ఉదయభానుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్, భూక్యసీతమ్మ, జడ్పిటిసి యేసుపోగు దేవమని, మండలపార్టీ అధ్యక్షులు గాదేల రామారావు, వైస్ ఎంపిపిలు కాటేపల్లి రామలక్ష్మి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారికి దీవెన ఫౌండేషన్ ఆర్థిక సాయం



ప్రజాశక్తి - వన్‌టౌన్ : మెదడువాపు వ్యాధితో బాధపడుతున్న 18 నెలల బాబు జయరాజు గవర్నమెంట్ పిల్లల హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ ఉన్నాడు మెదడులో నీరు చేరటంతో బాబుకు శస్త్ర చికిత్స చేయాల్సి వచ్చింది. తల్లి శివపార్వతి కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తూ ఉంది. ఆమెకు నా అనేవారు లేక సహాయం కోసం దీవెన ఫౌండేషన్ వారిని ఆశ్రయించగా గురువారం దీవెన ఫౌండేషన్ విజయవాడ సిటీ పోలీస్ వారి తరపున రూ.10 వేలు ఆర్థిక సహాయం సత్యనారాయణపురం ఎస్సై దుర్గ మహేశ్వరరావు చేతుల మీదుగా బాధిత తల్లికి అందజేశారు. గ్రూప్ సభ్యులైన హెడ్ కానిస్టేబుళ్లు నరసింహ, ప్రవీణ్ ఆర్థిక సహాయం అందజేసిన వారిలో ఉన్నారు. పేదవారికి, ఆపదలో ఉన్నవారికి సహాయం చేస్తున్న దీవెన ఫౌండేషన్ సభ్యులకు తల్లి శివపార్వతి కతజ్ఞతలు తెలిపారు.

దుర్గమ్మ, తిరుపతమ్మలకు ఆషాడం సారె

ప్రజాశక్తి - వన్‌టౌన్, పెనుగంచిప్రోలు : ఆషాఢ మాసం సందర్భంగా దేవస్థానం నందు శ్రీ అమ్మవారికి సారె సమర్పించేందుకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కర్నాటి రాంబాబు మరియు అధికారులు వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శ్రీ అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం దేవస్థానం వారు ఏర్పాటు చేసిన అమ్మవారి ఉత్సవ విగ్రహం వద్ద ఆలయ అర్చకులు పూజలు నిర్వహించి, అందరికీ ఆశీర్వాదం అందజేశారు. **పెనుగంచిప్రోలులోని** శ్రీ తిరుపతమ్మ అమ్మవారికి ఆషాడమాసం సందర్భంగా వివిధ గ్రామాల నుంచి యాత్రికులు ఆషాఢ సారె గురువారం సమర్పించారు. జగ్గయ్యపేట మండల పరిధిలోని ముచ్చింతల, లింగగూడెం గ్రామాల నుంచి, అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొని అమ్మవారికి వివిధ రూపాలలో సారె సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ డిప్యూటీ కె.రమేష్ నాయుడు ధర్మకర్తల మండల చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు సాదరంగా ఆహ్వానం పలికి అమ్మవారి ఆశీర్వచనం కల్పించారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



పేదలకు మంచి చేయడమే ధ్యేయం

ప్రజాశక్తి కంచికచర్ల : పేదవాడు ఎలా ఉన్నా ఏ ఒక్కరూ పట్టించుకొని పరిస్థితులు పోయి ప్రతి పేదవాడికీ మంచి జరగాలన్నదే వైసిపి ప్రభుత్వం ధ్యేయమని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు అన్నారు. కంచికచర్ల సచివాలయం 1 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం ఉపసర్పంచ్ వేమా సురేష్ బాబు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహనరావు, లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెల్పుల సునీత ఎంపిపి బషీర్ సొసైటీ ఛైర్పర్సన్ కాలవ పెద్ద బాబు, ఎంపిడిఒ బాలకంకర్ డిప్యూటీ తహశీల్దార్ నాగులు మీరా, కార్యదర్శి ఖాదర్ మీర్జా వలి, ఎపిఎం భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు..

21 నుండి ఇంటింటి సర్వే



ప్రజాశక్తి- తిరువూరు : తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో ఈనెల 21 నుండి ఓటర్ల జాబితాపై చేపట్ట నున్న ఇంటింటి సర్వేలో తీసుకోవాల్సిన అంశాల గురించి బూత్ లెవెల్ అధికారులకు, సూపర్వైజర్లకు స్థానిక టి టిడి కళ్యాణ మండపంలో గురువారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు పాల్గొన్నారు. ప్రతీంటికి వెళ్లి పక్షపాతి లేకుండా ఓటర్ జాబితాలో ఉన్న పేర్లు గలవారు ఇంటిలోనే ఉంటున్నారా లేదా వివరాలను సేకరించాలన్నారు. కొత్త ఓటరు గా నమోదు చేయాల్సి వస్తే 1-10-2023 నాటికి 18 సంవత్సరాలు పూర్తయి వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో డి.ఆర్.ఓ మోహన్ కుమార్, తిరువూరు ఆర్డీవో వైవీ ప్రసన్నలక్ష్మి, తహశీల్దార్లు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి-విజయవాడ : బియ్యం, కందిపప్పు వంటి నిత్యావసర వస్తువులకు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ డా. పి. సంపత్ కుమార్ హెచ్చరించారు. స్థానిక జాయింట్ కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో గురువారం పౌరసరఫరాలు, మార్కెటింగ్, హోల్‌సెల్ డీలర్లు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులతో జాయింట్ కలెక్టర్ పి. సంపత్ కుమార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లలో బియ్యాన్ని అధిక ధరలకు విక్రయాలు జరుగుతున్నాయనే ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. జిల్లాలోని అన్ని రైతు బజార్లలో రైస్ మిల్లర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా బియ్యం అమ్మకాలను నిర్వహించాలని ఆదేశించామన్నారు.

శ్మశాన వాటికలో ముళ్ల కంపలు తొలగింపు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలో పద్మశాలి స్మశాన వాటికలో పెరిగిన ముళ్ళ, పిచ్చిచెట్లు శ్రీ పద్మశాలీ సంక్షేమ సంఘం జగ్గయ్యపేట ఆధ్వర్యంలో జేసిబి ద్వారా తొలగించారు. కులబంధువులు స్మశాన వాటికలోనికి వెళ్ళటానికి, కర్మకాండలు చేసుకోవడానికి అసౌకర్యం కలగటంతో జెసిబిని ఏర్పాటు చేసి ముళ్ళ చెట్లు తొలగించారు. జంగల్ క్లీనింగ్‌ని సంఘ అధ్యక్షులు పెనుమలు చంద్రమౌళి, సంఘ ప్రతినిధులు స్వయంగా దగ్గర ఉండి ముక్త్యాల రోడ్‌లోని పద్మశాలి హిందూ స్మశాన వాటికలో మరియు పరిసర ప్రాంతాల్లో విపరీతంగా పెరిగిపోయిన సర్కారీ కంప, చెట్లు, పిచ్చి మొక్కలు తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు అల్లి రవిచంద్, గాలి శ్రీను, రచ్చ శ్రీను, గోసిక శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు సాయం

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : చెవికి సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న ఎనికేపాడు గ్రామానికి చెందిన నితీష్ అనే బాలుడికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.96 వేలు పంచాయతీ కార్యాలయ సిబ్బంది అందజేశారు. బాలుడి సమస్యను ఎంఎల్ఎ వంశీ దృష్టికి గ్రామ నాయకులు తీసుకెళ్లగా స్పందించిన ఆయన (ఎల్‌ఓసి)ని మంజూరు చేయించారు. మంజూరైన నగదును పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రాచమళ్ళ పూర్ణ, కోనేరు సుబ్బారావు, మోతే సుబ్బారావు, క్రాంతి, వెంకటేశ్వరరావు చేతులు మీదుగా బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఎంపిపి చర్యలపై జనసేన నిరసన

ప్రజాశక్తి కంచికచర్ల : సినీ నటుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చిత్ర పటాన్ని దగ్ధం చేయటాన్ని నిరసిస్తూ కంచికచర్లలో జనసేన నాయకులు, కార్యకర్తలు నిరసన ప్రదర్శన చేశారు. వాలంటీర్లను పవన్ కళ్యాణ్ అసభ్యకరంగా మాట్లాడారని కంచికచర్ల ఎంపిపి షేక్ మలక్ బషీర్ పవన్ చిత్రపటాన్ని చెప్పులతో కొట్టించి, దగ్ధం చేసి వివాదాల్లోకి దిగాడు. దీంతో ఎంపిపి తీరును నిరసిస్తూ, జనసేన కార్యకర్తలు పవన్ కళ్యాణ్ అభిమానులు గురువారం పట్టణంలోని జాతీయ రహదారిపై నిరసన ప్రదర్శన చేశారు. స్థానిక నెహ్రూ సెంటర్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు ఎంపిపి డౌన్ డౌన్ అంటూ, వెంటనే పవన్ కళ్యాణ్‌కు క్షమాపణలు చెప్పాలి అంటూ నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు.

సమగ్ర ఓటర్ల జాబితా రూపకల్పనకు చర్యలు

ప్రజాశక్తి-విజయవాడ : సమగ్ర ఓటర్ల జాబితా రూపకల్పనకు నగర ప్రజలు, రాజకీయపక్షాలు సహకరించాలని అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి డి వెంకటలక్ష్మి కోరారు. 79-విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ప్రత్యేక సంక్షిప్త ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై రాజకీయపక్షాల ప్రతినిధులతో గురువారం డిసిఆర్ వెంకటలక్ష్మి ఛాంబర్‌లో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డిసిఆర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు ఎంతో విలువైనదని, సమగ్రమైన ఓటర్ల జాబితాకు రాజకీయపక్షాలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమం ప్రకారం ఈ నెల 21 నుంచి వచ్చే నెల 21 వరకు బూత్ లెవల్ అధికారులు హౌస్ టు హౌస్ వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. సదరు కార్యక్రమములో భాగంగా ఓటర్ల జాబితాలో ఏదైనా తప్పులు (అనగా మరణించిన, రెండు సార్లు ఓటరుగా నమోదైన వారిపేర్లు తొలగించుట ఇతర తప్పులు అనగా పేరు, ఇంటి పేరు, రిలేషన్ టైపు, రిలేషన్ నేమ్, జెండర్ తప్పులు మరియు డోర్ నెంబరు) వుంటే వెంటనే దరఖాస్తులను స్వీకరించబడతాయన్నారు.

ప్లాస్టిక్ కవర్లు నిషేధించాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - గంపలగూడెం: ప్లాస్టిక్ కవర్లను వెంటనే నిషేధించాలని కోరుతూ, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గురువారం కలెక్టర్ డిల్లీ రావు తిరువూరు వచ్చిన సందర్భంగా తిరువూరు ఏరియా జన విజ్ఞాన వేదిక ప్రతినిధి బంక జాన్ సుందర్‌రావు వినతి పత్రం అందజేశారు. రోజురోజుకు ప్రజల ఆరోగ్యం క్షీణిస్తుందని, ప్రజలే కాదు మూగజీవాల సైతం అధిక సంఖ్యలో మత్యువాత పడుతున్నట్లు వినతిలో పేర్కొన్నారు. వెంటనే నిషేధానికి చర్యలు చేపట్టాలని జాన్ వివరించారు.



గ్రంథాలయాలకు పుస్తకాలు కొనుగోలుపై ఆరోపణలు బాధాకరం

తెలుగు ప్రచురణకర్తల సంఘం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : రాష్ట్రం విడిపోయి తొమ్మిది సంవత్సరాలుకాగా ఒకే ఒక్క సంవత్సరం పుస్తకాలు కొన్న కృష్ణాజిల్లా కొనుగోలుపై ఆరోపణలు రావడం బాధాకరమని రాష్ట్ర తెలుగు ప్రచురణ కర్తల సంఘం అధ్యక్షులు ఎస్. వెంకట నారాయణ ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. రాష్ట్రం విడిపోయిన తరువాత గ్రంథాలయాలకు పుస్తకాలే కొనలేదన్నారు. అప్పటి విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి చొరవతో ఎంపిక కమిటీ ఏర్పడి 8 నెలలకు పుస్తకాల జాబితా ఎంపిక చేయబడిందన్నారు. ఆసంవత్సరం కృష్ణా, విజయనగరం, కర్నూలు జిల్లాలలో పుస్తకాలు కొనుగోలు చేశాన్నారు. ఆ తరువాత మరో ఎంపిక జాబితా రాలేదన్నారు. అదే జాబితా నుండి అన్ని జిల్లాలకు పుస్తకాలు కొన్నారన్నారు. ఇంతవరకూ కొన్ని జిల్లాలు ప్రచురణ కర్తలకు సొమ్ము జమచేయలేదన్నారు. రాష్ట్రం విడిపోయి 9 సంవత్సరాలుకాగా ఒక సంవత్సరం పుస్తకాలు కొన్న కృష్ణాజిల్లాపై ఆరోపణలు రావడం బాధాకరమన్నారు. సెలక్షన్ కమిటీకి జాయింట్ కలెక్టర్ అధ్యక్షులు అన్నారు. అప్పట్లో పుస్తకాలు కొనుగోలు చేసిన సమయంలో గ్రంథాలయ సంస్థలకు అధ్యక్షులు కూడా లేరన్నారు. ఆ తరువాత రాజకీయంగా కొంత మందిని ఎంపికచేసినా వారు అధ్యక్షులయ్యారన్నారు. మరి కృష్ణాజిల్లాలో నూతన అధ్యక్షులు వచ్చిన తరువాత పుస్తకాలు కొనకపోవడం ఒక విచిత్రం కూడా అన్నారు. 9 ఏళ్లలో ఒకేసారి కొన్న కొనుగోలుపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదం అని ఇలాంటి ఆరోపణలు వల్ల ప్రచురణరంగం నిర్వీర్యం కాదలదని అభిప్రాయం వ్యక్తం చేశారు.



సిపిఎం సీనియర్ నాయకులు బత్తుల వెంకట్రావు మృతి

ప్రజాశక్తి - అజిత్ సింగ్‌నగర్ : సిపిఎం సీనియర్ నాయకులు బత్తుల వెంకట్రావు గురువారం మృతిచెందారు. రాజీవ్ నగర్ 63వ డివిజన్లో నివాసం ఉంటున్న వెంకట్రావు భౌతిక కాయాన్ని సిపిఎం సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు, నాయకులు కె.దుర్గారావు, తూర్పు సిటీ నగర నాయకులు బత్తుల చిన్నారావు, డివిజన్ కార్యదర్శి బొంగు రాంబాబు, మహిళా కార్యదర్శి బొంగు అమ్ములు, పార్టీ సభ్యులు ఎర్రన్న, సాంబిరెడ్డి, వెంకటరెడ్డి, తదితరులు సందర్శించి నివాళు లర్పించారు. ఆయన మృతికి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భూపతి రమణారావు మాట్లాడుతూ వెంకట్రావు 1964 నుండి సిపిఎంలో ఉంటూ పార్టీ విస్తరణకు కృషి చేశారని, అనేక పోరాటాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. చివరి శ్వాస వరకూ పార్టీలో ఉన్నారని తెలిపారు.

పెడన చైర్‌పర్సన్‌గా నాగకుమారి ప్రమాణం

ప్రజాశక్తి-పెడన: అభివృద్ధి, సంక్షేమ ఫలాలు పెడన పట్టణవాసులందరికీ గతంలో ఏ విధంగా అందించబడ్డాయో అదే మాదిరిగా ఆ రెండింటిని కొనసాగిస్తూ, చైర్ పర్సన్ పదవికి వన్నె తెస్తూ, పార్టీ ప్రతిష్టను పెంపొందించే విధంగా కషి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ సూచించారు. గురువారం ఉదయం పెడన పట్టణంలో మున్సిపల్ నూతన చైర్ పర్సన్‌గా కటకం నాగకుమారి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో మంత్రి జోగి రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. పెడన మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నిక కార్యక్రమానికి ప్రిసైడింగ్ అధికారిగా మచిలీపట్నం ఆర్డిఓ ఐ.కిషోర్ వ్యవహరించారు. తొలుత పెడన పురపాలక సంఘం మాజీ చైర్‌పర్సన్ బళ్లా జ్యోత్స్నరాణి 7 వ వార్డు కౌన్సిలర్ కటకం నాగ కుమారిని నూతన చైర్ పర్సన్ అభ్యర్థిగా ప్రతిపాదించగా, 19 వ వార్డు కౌన్సిలర్ సిరివెళ్ల జయేష్ బలపరిచారు. పోటీ అభ్యర్థి ఏ ఒక్కరు లేకపోవడంతో



నాగకుమారిని అభినందిస్తున్న మంత్రి జోగి రమేష్

నూతన చైర్ పర్సన్ కటకం నాగ కుమారి ఏకగ్రీవంగా ఎంపికైనట్లు ఎన్నికల అధికారి ఐ. కిషోర్ అధికారికంగా ప్రకటించారు. అనంతరం మంత్రి జోగి రమేష్ పెడన మున్సిపల్ నూతన చైర్‌పర్సన్ పదవికి ఎన్నికైన కటకం నాగ కుమారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెడన పట్టణంలో అభివృద్ధి ప్రతి ఇంటి తలుపు తట్టిందన్నారు. పెడన పట్టణంలో 2,700 మందికి ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాక గహాలను సైతం నిర్మించి ఇవ్వడం పెడన పట్టణ చరిత్రలో గతంలో ఎన్నడూ జరగలేదన్నారు. పక్కా రోడ్ల నిర్మించడం, విద్యుత్ సౌకర్యం కలిగించడం, సురక్షిత తాగునీరు ప్రజలకు అందించడం వంటి ఎన్నో మంచి కార్యక్రమాలు పెడన మున్సిపాలిటీ పరిధిలో జరిగిందన్నారు. అనంతరం వైస్ చైర్మన్ ఖాజా, 17వ వార్డు కౌన్సిలర్ మెట్ల గోపి ప్రసాద్, 21వ వార్డు కౌన్సిలర్ పిచ్చుక సతీష్ బాబు, 9వ వార్డు కౌన్సిలర్ గరికిముక్కు చంద్రబాబు తదితరులు నాగకుమారికి అభినందనలు తెలిపారు. **ప్రజాశక్తి-గూడూరు:** పెడన పురపాలక సంఘ చైర్మన్‌గా నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన కటకం నాగకుమారిని గూడూరు మండల పరిషత్ అధ్యక్షులు సంగా మధుసూదనరావు, జడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, వైసిపి మండల అధ్యక్షులు గౌరిపర్తి రవికుమార్ తదితరులు కలిసి అభినందనలు తెలిపారు.



జడ్‌పి విద్యార్థులకు ట్రిపుల్ ఐటిలో సీట్లు

ప్రజాశక్తి-కోడూరు: కోడూరు శివారు స్వతంత్రపురం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ట్రిపుల్ ఐటి పరీక్షా ఫలితాలలో అద్వితీయ ప్రతిభను కనపరచినట్లు పాఠశాల హెచ్ఎం ఆలా వెంకటరమణ తెలిపారు. జరుగు జగదీష్, ఆళ్ళమూడి సరయు, ఈర్ల ధనశేఖర్, నాగిడి మనస్విని, పులి నవ్య సీట్లు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు హెచ్ఎం అభినందనలు తెలిపారు.

బిల్ కలెక్టర్‌పై క్రిమినల్ కేసు

ప్రజాశక్తి-ఉయ్యూరు: పెనమలూరు గ్రామ పంచాయతీలో రూ.35,82,942 దుర్వినియోగం చేసిన బిల్ కలెక్టర్ షేక్ షంషుద్దీన్‌పై జిల్లా పంచాయతీ అధికారి ఎస్.వి.నాగేశ్వర నాయక్ ఉత్తర్వుల మేరకు పెనమలూరు పోలీస్‌స్టేషన్ లో క్రిమినల్ కేసు నమోదైంది. పెనమలూరు గ్రామపంచాయతీ 2016వ సంవత్సరం నుండి 2022 జూన్ వరకు బిల్ కలెక్టర్‌గా ఉన్న షేక్ షంషుద్దీన్ ఇంటి పన్నులను వసూలు చేసి గ్రామపంచాయతీకి జమ చేయలేదు. దీనికి రాష్ట్ర లోకాయుక్తకు జంపాన శ్రీనివాసగౌడ్ ఫిర్యాదు చేసిన నేపథ్యంలో బిల్‌కలెక్టర్‌పై కేసు నమోదు చేశారు.


'రోడ్లు బాగు చేయాలి'

ప్రజాశక్తి-కోడూరు: మండల పరిధిలోని పిట్టలంక నుండి బావిశెట్టివారిపాలెం వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండటంతో గురువారం జనసేన పార్టీ నాయకులు రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగాగ్రామ సర్పంచ్ కనగాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వర్షం పడితే రోడ్డు చెరువుగా మారుతుందన్నారు. గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులను రాష్ట్ర ప్రభుత్వం పథకాలకు వాడుకోవడంతో పంచాయతీలు పూర్తిగా నిర్వీర్యం అయిపోతున్నాయని వాపోయారు. తక్షణమే రహదారి నిర్మించకపోతే గ్రామంలో భిక్షాటన చేసి రహదారి నిర్మించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల అధ్యక్షులు మర్రె గంగయ్య, ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యదర్శి కొండవీటి సునీత, తోట సోమశేఖరరావు, ప్రధాన కార్యదర్శి పరిశె సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధే సిఎం ధ్యేయం

ప్రజాశక్తి-ఉంగుటూరు(గన్నవరం)

ఉంగుటూరు మండలం ముక్కపాడు గ్రామ సచివాలయంలో ఎంపిడిఒ జి.ఎస్.వి శేషగిరిరావు అధ్యక్షతన జగనన్న సురక్ష ప్రత్యేక క్యాంపు గురువారం నిర్వహించారు. ప్రత్యేక అధికారి ఫణి ధూర్జటి మాట్లాడుతూ పేదల అభివృద్ధే సిఎం లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వి.సరోజినీ, సర్పంచ్‌లు ఎన్.అంజనాదేవి, కె.సుజాత, సిహెచ్.నిర్మల, పంచాయతీ కార్యదర్శి బి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-పెదపారుపూడి:** మండలంలోని భూషణగూళ్ల గ్రామ సచివాలయం పరిధిలో గురువిందగుంట, మహేశ్వరపురం గ్రామాల ప్రజలకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోగం సురేష్, గోళ్ల సోమేశ్వరరావు, డాక్టర్ ఎఎస్ఎ దివాకర్, సర్పంచ్ జువ్వనపుడిరాజు, దొండపాటి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కోడూరు:** విశ్వనాథపల్లి గ్రామంలో గురువారం కమ్యూనిటీ భవనం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు 576 మందికి సర్టిఫికెట్లు



అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, జడ్పిటిసి యాదవరెడ్డి, వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు:** మండలంలోని డోకిపర్రు గ్రామసచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని రెండో రోజు గురువారం నిర్వహించారు. 477 లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ దారపు శ్రీనివాస్, తహశీల్దారు అబ్దుల్ రెహమాన్‌మస్తాన్, మండల విస్తరణాధికారి వి.దిలీప్‌కుమార్, డిప్యూటి తహశీల్దారు కనకదుర్గ, గ్రామ సర్పంచ్ గోసాల జ్యోతి, చినగొన్నూరు సర్పంచ్ కోటప్రోలు నాగు పాల్గొన్నారు.

రోడ్లు జలమయం

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డలో గురువారం కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. ప్రధాన రహదారులన్నీ వర్షపు నీటితో నిండిపోవడంతో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కొన్ని ప్రాంతాల్లో గృహాల్లోకి వర్షపు నీరు చేరింది. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల వర్షపు నీరు ఇళ్లలోకి, రోడ్లపైకి చేరిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



'భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'



వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): మధ్యాహ్న భోజన పథకం లో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన పథకం యూనియన్ మండల కార్యదర్శి ఎం.మురళి ఆధ్వర్యంలో గురువారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్యదర్శి ఎం మురళి మాట్లాడుతూ గత 20 సంవత్సరాలు నుండి మధ్యాహ్నం భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వం కార్మికులగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రతినెల ఐదు తారీకు లోపు వేతనాలు చెల్లించాలని, సంవత్సరానికి 12 నెలలు వేతనాలు ఇవ్వాలన్నారు.అలాగే మార్కెట్లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మోనూ ఛార్జీలు 20 రూపాయలకు పెంచాలని ,పథకానికి బడ్జెట్ పెంచాలని అగ్ని ప్రమాదానికి గురి అయినటువంటి వంట వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలని పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదన్నారు. సిఐటియు మచిలీపట్నం కార్యదర్శి జయరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 88,256 మంది వంట కార్మికులు పనిచేస్తున్నరని . కేంద్రం తెచ్చిన నూతన విద్యా విధానంతో దుష్ఫలితాలు ప్రారంభమయ్యాయని అవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్కూల్లో భారీగా తగ్గిన విద్యార్థుల సంఖ్యను కూడా ఈ కాలంలో చూడొచ్చన్నారు. రేషనలైజేషన్ పేరుతో స్కూలు విలీనం చేయడం వల్ల ఉపాధి కోల్పుతున్న మిడ్ డే మీల్స్ వర్కర్లకు ఉపాధి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రమాదాలకు గురైన వారికి నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-ఉంగుటూరు: ఉంగుటూరు మండలం ముక్కపాడు గ్రామంలో వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌ను గురువారం స్థల దాతలు చల్లగుల్ల ఆదినారాయణచౌదరి, చల్లగుల్ల కృష్ణమూర్తి, చల్లగుల్ల లక్ష్మీమోహన్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు వి.సరోజినీ మాట్లాడుతూ గ్రామీణ వైద్యరంగంలో విప్లవాత్మకమార్పులు తెచ్చే ఉద్దేశంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ద్వారా గ్రామాల్లోనే జ్వరంతో పాటు ఇతర చిన్న అనారోగ్యాలకు చికిత్స అందించడంతో పాటు, 12 రకాల వైద్య సేవలు



అందించడంతో పాటు 14 రకాల వైద్య పరీక్షలు, 65 రకాల మందులు ,67 రకాల బేసిక్ మెడికల్ ఎక్విప్ మెంట్ తో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ జి.ఎస్.వి శేషగిరిరావు, ముక్కపాడు గ్రామ సర్పంచ్ ఎన్.అంజనాదేవి, లంకపల్లి గ్రామ సర్పంచ్ కె.సుజాత, ఎంపిటిసి వి.నాగిరెడ్డి, పిహెచ్‌సి ఉంగుటూరు డాక్టర్ కె.వాణి తదితరులు పాల్గొన్నారు.

18న వసతి గృహాల్లో సమస్యలపై నిరసన

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): సాంఘిక సంక్షేమ హాస్టల్లో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18న జిల్లాల కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్ తెలిపారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య కృష్ణాజిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం మోదుమూడి శ్రీహరిరావు భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కృష్ణా యూనివర్సిటీలో విద్యార్థులకు వసతి గహం



ఎప్పుడు ఏర్పాటు చేస్తారో చెప్పాలన్నారు. అక్కడ వసతి గృహం లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. హాస్టళ్లలో కనీస మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ సమావేశంలో నాయకులు చందు, బన్నీ, కార్తీక్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పట్టు వస్త్రాలు

ప్రజాశక్తి-చల్లపల్లి: మోపిదేవి కేంద్రంలో కొలువుతీరిన శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో పవిత్రోత్సవ సహిత ఆషాఢ కృత్తిక (ఆడికృత్తిక) మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు స్వామివారికి పట్టు వస్త్రాలు



సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన గ్రామసభలో పలు సమస్యలపై పంచాయతీ అధికారులను జనసేన నాయకులు నిలదీశారు. గ్రామసభల్లో ఇచ్చిన అర్జీలకు, హామీలకు



దిక్కులేదని, ఎక్కడి సమస్యలు అక్కడే ఉంటున్నా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని జనసేన పార్టీ మండల అధ్యక్షులు గుడివాడ శేషుబాబు, ఎంపీటీసీ బొప్పన భాను ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్మశాన వాటికలకు రహదారులు ఏర్పాటు చేయాలని, సింహాద్రికాలనీ, మండలపురం, రాజశేఖర్‌పురం కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. రూ. 15 లక్షలు ఖర్చు చేసినా వీధి దీపాలు వెలగడంపేదన్నారు. వీటిపై స్పందించిన గ్రామ సర్పంచ్ గోరుముచ్చు ఉమా సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కోడూరు సత్యనారాయణ, పంచాయతీ ఈవో తోట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఎందరికో మేలు

ప్రజాశక్తి - గంపలగూడెం: నూతనంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్య క్రమంతో ఎంతోమందికి మేలు జరిగిందని గంపలగూడెం ఎంపీపీ గోగులముడి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. గురువారం



పెనుగోలనులో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. గ్రామంలో 615 మందికి లబ్ధించేకూరగా సర్పంచ్ లలిత కుమారి, ఎంపీడీవో వైపి రెడ్డి, నాయకులు చెన్నకేశవరెడ్డి పాల్గొన్నారు. అనుముల లంకలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 475 మందికి లబ్ధి చేకూరింది. స్థానిక ఎంపిటిసి జి.కమల, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, తహశీల్దార్ జి.బాలకష్ణారెడ్డి, పిఒపిఆర్డి బాబురావు, సచివాలయ సిబ్బంది, వాలంటరీలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఆలయ హుండీల లెక్కింపు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణంలోని అద్దాల బజారు సమీపంలోని బందావనంలో కొలువై ఉన్న శ్రీ సంపూర్ణ వెండి మహాలక్ష్మి అమ్మవారి ఆలయ మహిళా భక్త బందం సభ్యులు గురువారం శ్రీశైలములోని భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారి ఆలయ హుండీల లెక్కింపు సేవా కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆలయం వద్ద నుండి తరలి వెళ్లారు. సుమారు 30 మంది మహిళా భక్తులు మహిళా కమిటీ ప్రతినిధి సూర్య శ్రీదేవి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా శ్రీశైలం ఆర్టీసీ బస్సులో బయలుదేరి వెళ్లారు.

సహస్ర ఘట్టాభిషేకం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని వేదాద్రి గ్రామంలో గల శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవ స్థానములో నెలకొనియున్న క్షేత్రపాలక శ్రీ పార్వతి సమేత శ్రీ విశ్వేశ్వర స్వామి వారి దేవాలయములో లోక కళ్యాణార్థం సకలజనులు ఆయురా రోగ్యాలతో



ఉండాలని, పాడిపంటలు సమద్ధిగా పండాలని శ్రీ పార్వతీ సమేత విశ్వేశ్వర స్వామి వారికీ గురువారం ఉదయం గం. 9.00 ల నుండి దేవస్థాన అర్చకులు, సిబ్బంది మరియు భక్తుల సహాయ సహకారములతో దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త డాక్టర్ వి.ఎల్.ఇందిరాదత్తు అధ్వర్యంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారిణి శిరిపురపు హేమలత దేవి పర్యవేక్షణలో వైభవంగా "సహస్ర ఘట్టాభిషేకము" నిర్వహించారు. ఈ కార్యకమంలో వేదాద్రి గ్రామ భక్తులు పాల్గొని దేవస్థాన కష్ణానది నుండి బిందెలతో నీరు తెచ్చి శ్రీ స్వామి వారికీ అభిషేక కార్యక్రమములు నిర్వహించారు.

టిడిపి సీనియర్ నాయకులు నామా మృతి

ప్రజాశక్తి - గంపలగూడెం: మండలంలోని పెనుగొలను గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు నామా సత్యనారాయణ (70) గురువారం ఉదయం మతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సత్యనారాయణ నీటి సంఘం అధ్యక్షులుగా, ఎంపీటీసీ సభ్యునిగా, సహకార సంఘ అధ్యక్షునిగా కొనసాగారు. తెలుగుదేశం పార్టీలో కీలక పాత్ర పోషిస్తూ పార్టీని ముందుకు నడిపారు. ఆయన భౌతికకాయాన్ని విజయవాడ ఎంపీ కేసినేని శ్రీనివాస్



సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. అదేవిధంగా సీనియర్ నాయకులు చెరుకు రాజేశ్వరావు, పుల్లయ్య చౌదరి, రేగళ్ల వీరారెడ్డి వివిధ గ్రామాల పార్టీ క్యాడర్ సందర్శించి నివాళులర్పించారు. గురువారం సాయంత్రంతో నామ అంతిమయాత్ర ముగిసింది.

ఫ్లడ్‌లైట్లు వితరణ

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు మినీ స్టేడియంకు నాలుగు ఫ్లడ్ లైట్లను గ్రౌండ్ సూపర్ వైజర్ కందుల నాగరాజుకు లయన్స్ క్లబ్.సభ్యులు, అమరావతి ఆసుపత్రి వైద్యులు కోనేరు కష్ణ 4 ఫ్లడ్ లైట్లు, కీలారు శివరామకష్ణ అర్ ఓ వాటర్ ఫిల్టర్‌ను గురువారం అందజేశారు.



జలజీవన్ పైలెట్ ప్రాజెక్టుకు పెనుగంచిప్రోలు ఎంపిక

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : రాష్ట్రంలో, గ్రామస్థాయిలో గ్రామీణ నీరు పారిశుద్ధ్య కమిటీ, స్వయం సహకార సహాయక సంఘాలు, గ్రామైక్య సంఘాల భాగస్వామ్యంగా ప్రతి గ్రామంలో ఇంటింటికి మంచినీటి కుళాయి అందించాలని మంచి ఉద్దేశంతో జలజీవన్ మిషన్ ద్వారా కార్యక్రమం చేపడుతు



న్నామని రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.వీరాస్వామి పేర్కొన్నారు.. ఎన్టీఆర్ జిల్లాలో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకు వెళ్లేందుకు పెనుగంచిప్రోలు గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుకు ఎంపిక చేయడం జరిగిందని వీరాస్వామి తెలిపారు. గ్రామపంచాయతీ సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్ ప్రాజెక్టు చెందిన రాష్ట్రస్థాయి ప్రతినిధుల బందం గురువారం పెనుగంచిప్రోలు గ్రామాన్ని సందర్శించారు . ప్రభుత్వ విప్ ఉదయభాను ఆధ్వర్యంలో సర్పంచ్ పద్మ కుమారి చేస్తున్న అభివద్ధి పనులను ఈ బందం క్షుణ్ణంగా పరిశీలించారు .ఎక్కడా లేని విధంగా గ్రామీణ ప్రాంతంలో ఒక అత్యద్భుతమైన పార్కును ఏర్పాటు చేయడం, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని కనీ, విని ఎరుగని రీతిలో ఒక పార్కు లాగా తీర్చిదిద్దడం తమను ఎంతగానో ఆకట్టుకుందని ఆయన సర్పంచ్ వేల్పుల పద్మ కుమారిని అభినందించారు. గ్రామంలో ఇంటింటికి ఒక సంవత్సరంలోనే మంచినీటి కొళాయిని అందించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రాజెక్ట్ ప్రతినిధులు ఎస్కే సత్తార్, ఎన్టీఆర్ జిల్లా జల జీవన్ మిషన్ రాష్ట్ర కోఆర్డినేటర్ రాష్ట్ర కోఆర్డినేటర్ రామకష్ణ, నాగేశ్వరరావు, హార్ట్ అమలు సహాయక సంస్థ సిబ్బంది, కార్యదర్శి గొర్రపాటి శ్యామ్ కుమార్, గ్రామ అభివద్ధి కమిటీ చైర్మన్ వేల్పుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధి చేసిన వారికి మద్దతివ్వండి'

ప్రజాశక్తి- నందిగామ : నందిగామను ఎవరు అభివద్ధి చేశారో .. వారికి మద్దతు ఇవ్వండి .. మీకు ఏ ప్రభుత్వం మంచి చేసిందో.. వారినే గెలిపిం చాలని ఎంఎల్‌సి మొండి తోక అరుణ్ కుమార్



పేర్కొన్నారు. నందిగామ పట్టణంలోని 9, 10 వార్డుల పరిధిలో జగనన్న సురక్ష క్యాంపులో పాల్గొని మంజూరైన సర్టిఫికెట్లను ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ అందజేశారు. నందిగామను 30 ఏళ్ళు పాలించిన నాయకులు చేయలేని పనులను తాము అధికారంలోకి వచ్చాక 3 ఏళ్ళలో చేసి చూపించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పవన్ చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీలను రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నాయకులు వాలంటీర్ల చేత తగలబెట్టించడం కాళ్లతో తొక్కడం వంటి చర్యలు నిరసిస్తూ మండల కేంద్రమైన రెడ్డిగూడెంలో గురువారం మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలివచ్చిన జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పవన్ కళ్యాణ్ ఫ్లెక్సీ కి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా హలో ఎపి బైబై వైసిపి అంటూ పలు నినాదాలు జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున చేశారు. అనంతరం మండల జనసేన పార్టీ నాయకులు పాములపాటి సుందర్ రామిరెడ్డి, చాపలమడుగు కాంతారావు మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ఏలూరు సభలో మాట్లాడిన మాటలు వినకుండా వాలంటీర్లు ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడటం హాస్యాస్పదంగా ఉందని వైసిపి ఓటమి భయంతోనే ఇటువంటి చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన పార్టీ నాయకులు కొండపల్లి మణికంఠ, బొంబోతు వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

59 వ డివిజన్లో గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి - అజిత్‌సింగ్‌నగర్ : పేదల ఆర్థికాభివద్ధే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆ దిశగా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 59వ డివిజన్ 254వ వార్డు సచివాలయ పరిధిలో గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఎండి షాహినా సుల్తానాతో కలిసి ఆయన పాల్గొన్నారు. గంగానమ్మ గుడి దగ్గర నుంచి పాదయాత్ర ప్రారంభించి జోరు వానలోనూ 250 గడపలను సందర్శించి ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులకు ప్రజల నుంచి ఆత్మీయ స్వాగతం లభించింది. ప్రతి సచివాలయానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రూ. 20 లక్షల నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. సెంట్రల్లో ఇప్పటివరకు 74 వార్డు సచివాలయాల పరిధిలో గడప గడపకు కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తిచేసుకోగా.. 70 పనులకు సంబంధించి రూ. 14 కోట్ల నిధులు మంజూరైనట్లు వెల్లడించారు.

టిడిపి హయాంలో వందిమాగదుల కోసమే కేబినెట్ నిర్ణయాలు

తెలుగుదేశం హయాంలో కేబినెట్ నిర్ణయాలు కేవలం అనుయాయులు, వందిమాగదులకు దోచిపెట్టడం కోసమే జరిగేవని మల్లాది విష్ణు విమర్శించారు. ఈ ప్రభుత్వంలో 54 వేల ఎకరాలను భూమిలేని దళిత, బడుగు, బలహీన వర్గాలకు చెందిన 46,935 మంది నిరుపేదలకు పంపిణీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ రామకష్ణ, ఏఎంఒహెచ్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరి, నాయకులు హాఫీజుల్లా, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలో ముస్లింలకు అన్యాయం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: పట్టణానికి చెందిన టిడిపి జిల్లా అధికార ప్రతినిధి షేక్ సయీద్ అన్వర్ గురువారం విజయవాడలో టిడిపి రాష్ట్ర ప్రముఖులను మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రస్తుత ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీలతో సహా అన్ని వర్గాల వారికి అన్యాయం జరుగుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల టిడిపి మైనారిటీ నేతలు తాజుద్దీన్, అక్సర్ ఖాన్, మౌలానా హాఫీజ్ ఖాన్, జగ్గయ్యపేట న్యాయవాది పారా రామారావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలతో ప్రజల ముంగిటకు పాలన

ప్రజాశక్తి వత్సవాయి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గ్రామ వార్డు సచివాలయాల వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకు పాలన తీసుకొచ్చారని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. గురువారం మండలంలోని లింగాల గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సామినేని ఉదయభాను పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ సంక్షేమం అందించేందుకే సిఎం జగన్ ఇలాంటి వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి యేసుపొగు దేవమని, మండల పార్టీ అధ్యక్షులు గాదెల రామారావు, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల రామారావు, దుర్గగుడి డైరెక్టర్లు నంబూరి రవి,అల్లూరి భాస్కర్, పోచవరం సర్పంచ్ హరికష్ణ రెడ్డి, తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన శ్రీరామ్ సోదరులు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో జాతీయ కోశాధికారి మరియు మాజీ ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ సోదరుడు శ్రీరామ్ ధనుంజయ్ (చినబాబు) పుట్టినరోజు సందర్భంగా పలుచోట్ల మొక్కలు నాటారు. షేర్ మహమ్మద్ పేట క్రాస్ రోడ్, ఆటోనగర్ వెళ్లేదారిలో మరియు షేర్ మహమ్మద్ పేట, గండ్రాయి పరిధిలో రహదారులు గుంటలు బాగా పడి వాహనదారులకు ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్నందువల్ల షేర్ మహమ్మద్ పేట టిడిపి నాయకుల ఆధ్వర్యంలో సుమారు రెండు ట్రక్కులు జిప్సం ద్వారా గుంటలను పూడ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగుదేశం కుటుంబ సభ్యులందరికీ నాయకులకు, కార్యకర్తలందరికీ కతజ్ఞతలు తెలిపారు.





అక్రమ నిర్మాణాలకు సీజ్

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణంలోని టిటిడి కల్యాణ మండపం వద్ద పాట వేటస్థలంలో అధికారులు ఆదేశాలు బేఖాతరు చేస్తూ అక్రమంగా నిర్మించిన భవనంలో యధావిధిగా పనులు కొనసాగించటాన్ని గురువారం దేవాదాయ శాఖ అధికారులు అడ్డుకున్నారు. నందిగామ రామలింగేశ్వర దేవస్థానం ఈవో సీతారామయ్య పనులు నిలిపి వేశారు. ఈ అనుమతులు లేకుండా నిర్మిస్తున్న ఈ భవనానికి దగ్గర ఉండి సీలు వేశారు. లీజు దారుడు అన్నే నాగేందర్‌కు సోమవారం 10వ తారీఖు నోటీసులు అందజేశామని ఈవో సీతారామయ్య తెలిపారు. నోటీసులు అందజేసిన అధికారులు ఆదేశాలు బేఖాతరు చేసి భవన నిర్మాణ పనులు భవనంలో ఇతర పనులు చేస్తున్న ఇతని పై చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తామని ఈఓ తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడాలి

ప్రజాశక్తి- తిరువూరు : ప్లాస్టిక్ నిషేదాన్ని ప్రకడ్బందీగా అమలు చేసి పర్యావరణాన్ని కాపాడాలని జనవిజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు బిజె.సుందరరావు కలెక్టర్ ఢిల్లీరావుకు వినతిపత్రం అందజేశారు. గురువారం తిరువూరు వచ్చిన కలెక్టర్‌ను కలిసిన సుందరరావు గుడ్డ సంచుల వాడకంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. తప్పకుండా ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రణ చేయిస్తానని, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరు బాధ్యతని అందుకు ముందుకొచ్చిన సుందరరావును కలెక్టర్ అభినందించారు.

అర్హులందరికీ సేవలందాలి

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సేవలు అందించాలనే సంకల్పంతోనే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి జగనన్న సురక్ష ద్వారా పలు సేవలు ఉచితంగా అందిస్తున్నారని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. మండల పరిధి లోని సుబ్బాయి గూడెం గ్రామ సచివాలయంలో గురువారం జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఒక్కరికి సంక్షేమం అందాలి అనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ప్రవేశపెట్టారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాపినేని వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



టిడిపి నుండి వైసిపిలోకి

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : మండల పరిధిలోని సుబ్బాయి గూడెం గ్రామానికి చెందిన షేక్ లాల్ బాషా, షేక్ బాషా,షేక్ లాలమ్మ ప్రతిపక్ష టిడిపిని వీడి అధికార పార్టీ వైసిపిలో చేరారు. గ్రామంలో గురువారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సమక్షంలో వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాపినేని.వెంకటేశ్వరరావు, ఎంపిపి గాంధీ, జెడ్పీటీసీ నాగమణి, మండల పార్టీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, బెజవాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పదవికే వన్నె తెచ్చిన తొలి మేయర్ : పేర్ని



మాట్లాడుతున్న శాసన సభ్యులు పేర్ని నాని

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : మచిలీపట్నం పురపాలక సంఘం నుంచి నగరపాలక సంస్థగా మార్పు చెందిన అనంతరం తొలి మేయర్ ఎన్నికైన మోకా వెంకటేశ్వరమ్మ తన పదవిని బాధ్యతాయుతంగా నిర్వహించి వన్నె తెచ్చారని మచిలీపట్నం శాసన సభ్యులు, మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) పేర్కొన్నారు. గురువారం మచిలీపట్నం నగరపాలక సంస్థ సమావేశపు హాలులో కౌన్సిల్ సమావేశం ముగిసిన అనంతరం మేయరుగా మోకా వెంకటేశ్వరమ్మ తన పదవికి రాజీనామా చేశారు. సమర్పించిన రాజీనామాను కౌన్సిల్ ఈ సందర్భంగా ఆమోదించింది. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ కుటుంబంలో కొడుకుతో పాటు భర్త మోకా భాస్కరరావును పోగొట్టుకొని పుట్టెడు శోకంలో ఉన్నప్పటికీ అప్పగించిన మేయర్ పదవిని బాధ్యతాయుతంగా నిర్వర్తించారని కొనియాడారు. తన పదవి సమయంలో నగర ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ తోటి కార్పొరేటర్ల సమస్యలను పరిష్కరించడంలో ఎంతో కృషి చేశారన్నారు. భర్త చనిపోయాడన్న కారణంతో కాకుండా పురపాలక సంఘంలో సీనియర్గా ఎంతో అనుభవం కలిగియుండటంతో మేయర్ పదవి అప్పజెప్పడం జరిగిందని తెలిపారు. ఆ సమయంలో తనకు మేయర్ పదవి కావాలని తన ముందు ఏనాడూ ప్రస్తావించలేదని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఒప్పందం ప్రకారం రెండు సంవత్సరాలు ముగిసిన అనంతరం రాజీనామా చేయమని అడగకుండానే తానే స్వయంగా రాజీనామా సమర్పించారని, అది ఆమె విశ్వసనీయతకు గొప్ప నిదర్శనమని చెప్పారు. మాజీ డిప్యూటీ మేయర్లు కంటిపూడి కవిత, లంకా సూరిబాబు ఇరువురు నగర ప్రజల సమస్యలను పరిష్కరించడానికి చేసిన కృషి అభినందనీయమన్నారు.

డిప్యూటీ మేయర్లు ఎన్నిక : మచిలీపట్నం నగరపాలక సంస్థకు నూతనంగా ఎన్నికైన డిప్యూటీ మేయర్లు తమకు వచ్చిన పదవిని అధికారంలా కాకుండా సేవగా భావించి బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని, నగర ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని మచిలీపట్నం శాసన సభ్యులు పేర్ని వెంకట్రామయ్య (నాని) నూతన డిప్యూటీ మేయర్లు మాడపాటి విజయ లక్ష్మీ, శీలం భారతీ నాగ కుసుమలకు సూచించారు. గురువారం మచిలీపట్నం నగరపాలక సంస్థ సమావేశపు హాలునందు డిప్యూటీ మేయర్ల ఎన్నిక కార్యక్రమం జరిగింది. రాష్ట్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు కౌన్సిల్ సభ్యులు డిప్యూటీ మేయర్లను ఎన్నుకోగా జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్ ప్రిసైడింగ్ అధికారి హోదాలో వారిచేత ప్రమాణ స్వీకారం చేయించి అధికారిక దవపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పేర్ని నాని వారిరువురిని అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ చంద్రయ్య, డిప్యూటీ మేయర్లు తంటిపూడి కవిత, లంకా సూరిబాబు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.

కృష్ణా వర్సిటీ నూతన ఉపకులపతిగా జ్ఞానమణి



ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : కృష్ణా యూనివర్సిటీ నూతన ఉపకులపతిగా ఆచార్య జి.జ్ఞానమణి శుక్రవారం భాధ్యతలు స్వీకరించనున్నారు. జ్ఞానమణి ఆంధ్ర యూనివర్సిటీ పూర్వ జువాలజీ ఆచార్యులు, పూర్వప్రిన్సిపాల్, కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆంధ్ర యూనివర్సిటీలో విధులు నిర్వహించారు. ఆంధ్ర యూనివర్సిటీలో వివిధ విభాగాలలో విశేష సేవలు అందించారు.

ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన రేవతి



ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ : స్థానిక మహాత్మ జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ బ్యాక్వర్డ్ క్లాస్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యనభ్యసించి 2022-23 విద్యా సంవత్సరంలో పదవ తరగతి ఉత్తీర్ణురాలైన సైకం రేవతికి ఒంగోలులోని ట్రిపుల్ ఐటీలో సీటు లభించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ డా. ఎం అనిత మాట్లాడుతూ పూర్వ విద్యార్థులు ఎస్ఎస్సి పబ్లిక్ పరీక్షల్లో 600 మార్కులకు సైకం రేవతి 566 మార్కులు, సింగవరపు సిరి 535 మార్కులు సాధించి పాఠశాలలో ప్రథమ, ద్వితీయ స్థానాలను కైవసం చేసుకున్నారన్నారు. జగనన్న ఆణిముత్యాలలో భాగంగా మంత్రి జోగి రమేష్ చేతుల మీదుగా స్టేట్ బ్రిలియన్స్ అవార్డ్ అందుకున్నారని తెలిపారు. త్రిబుల్ ఐటీ సాధించిన రేవతి తమ పాఠశాలకు గర్వకారణమన్నారు. ఏటీపీ బి నవీన, ఉపాధ్యాయులు, సిబ్బంది రేవతిని అభినందించారు.

పల్స్ ఆక్సీమీటర్ల వితరణ

ప్రజాశక్తి-కోడూరు : ఇండియన్ రెడ్ క్రాస్ కోడూరు మండల శాఖ వారి ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లకు పల్స్ ఆక్సి మీటర్లు వితరణ చేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కృష్ణ జిల్లా శాఖ వారు అందించిన పల్స్ ఆక్సీ మీటర్లను గురువారం కోడూరులో వివిధ అంగనవాడి సెంటర్లలో పని చేస్తున్న టీచర్లకు కోడూరు మండల శాఖ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులకు అంగన్వాడీ టీచర్లు ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోడూరు మండల శాఖ చైర్మన్ వేజెండ్ల శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ తోట శ్రీనివాసరావు, శాఖ సభ్యులు రేపల్లె యోగ ప్రకాష్, గోనా వేణు, జొన్నా రవిశంకర్ పాల్గొన్నారు.

28న ఉమ్మడి కృష్ణాజిల్లా ఖో-ఖో సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి-గుడివాడ : ఉమ్మడి కష్ణా జిల్లా ఖో -ఖో అసోసియేషన్ అధ్వర్యంలో ఈ నెల 28న ప్రత్యేక సర్వ సభ్య సమావేశాన్ని విజయవాడలోని పటమట ఎస్.వి. బి.వి.ఎన్.హైస్కూల్లో నిర్వహిస్తునట్లు అసోసియేషన్ కార్యదర్శి ఎం.వి.ఎస్.ఎస్.ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ క్రీడా నియమావళి నియమ నిబంధనల ప్రకారం ఉమ్మడి కష్ణాజిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. 28వ తేదీ ఉదయం 10 గంటలకు నామి నేషన్ల స్వీకరణ, 11 గంటలకు నామినేషన్ల పరిశీలన, 12 గంటలకు నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమం జరుగుతుందని ప్రసాద్ వెల్లడించారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఎన్నికల అధికారిగా హైకోర్టు అదనపు ప్రభుత్వ న్యాయవాది బి.కె.వి రమణి వ్యవహరిస్తారన్నారు. అనంతరం 4.30కి ప్రత్యేక సర్వసభ్య సమావేశం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని జిల్లా ఖో-ఖో సంఘం, అనుబంధ క్లబ్ సభ్యులు, క్రీడాకారులు ,వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొనాలని కార్యదర్శి ప్రసాద్ కోరారు.

14న జరగాల్సిన కృష్ణా వర్సిటీ పరీక్షలు వాయిదా

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : కృష్ణా యూనివర్సిటీ పరిధిలో ఈ నెల 14 న జరగనున్న యూ. జీ ఆరవ సెమిస్టర్ రెగ్యులర్ / సప్లిమెంటరీ పరీక్ష ను జూలై 18 వ తారీఖు నకు, ఈ నెల 14 న జరగనున్న యూ. జీ నాల్గవ సెమిస్టర్ పరీక్షను జూలై 19 వ తారీకు నకు వాయిదా వేసినట్లు విశ్వ విద్యాలయం పరీక్షల నియంత్రణధికారిని ప్రొఫెసర్ వై. మారుతీ తెలిపారు. కష్ణా యూనివర్సిటీ ప్రైవేట్ కాలేజస్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఈ నెల 14 న బంద్ నిర్వహిస్తున్న దష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వై. మారుతీ తెలిపారు.

డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి



ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో డ్రైనేజీ సమస్యకు అధికారులు ప్రజాప్రతినిధులు శాశ్వత పరిష్కారం చూపనందున చిన్నపాటి వర్షానికి కూడా ఆమనగడ్డ నీట మునుగుతున్నదని జనసేన పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్ విమర్శించారు. బుధవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి పట్టణంలో నీట మునిగిన పల్లపు ప్రాంతాలను జనసేన పార్టీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవనిగడ్డ లోని ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న ఎస్టి కాలనీవాసులు సుగాలి తండా బీసీ కాలనీ సింహాద్రి కాలనీ మండల పురం రాజశేఖర్ పరం లంకపమాన్యం స్టేట్ బ్యాంక్ రోడ్డు తదితర ప్రాంతాలన్నీ చిన్న వర్షానికే నీట మునిగిపోతున్నాయని, నిత్యం రద్దీగా ఉండే స్టేట్ బ్యాంకు రోడ్డు, ఎల్ఐసి, బిఎస్ఎన్ఎల్, హెడ్ పోస్ట్ ఆఫీస్ రోడ్లు ఉద్యోగులు ప్రజలు వెళ్లడానికి కూడా ఇబ్బందికరంగా తయారయ్యాన్నారు. మన వైపు తాసిల్దార్ కార్యాలయం, సబ్ ట్రెజరీ కార్యాలయాలు కూడా వర్షం వస్తే కార్యాలయాలు చుట్టూ నీరు చేరి ఇబ్బందిగా తయారవుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అవనిగడ్డను నీట మునగకుండా కాపాడి డ్రైనేజీని మెరుగుపరచాలని సూచించారు. ఆయనతోపాటు ఆ పార్టీ పట్టణ పార్టీ అధ్యక్షులు రాజనాల వీరబాబు పాల్గొన్నారు.

12వ పిఆర్సి కమిషన్ ఏర్పాటు హర్షణీయం

ప్రజాశక్తి-చల్లపల్లి : రాష్ట్రంలో ఉద్యోగులకు 11వ పిఆర్సి వేతన సవరణలో జరిగిన నష్టాన్ని భర్తీ చేసేలా 12వ పిఆర్సి కమిషన్ సిఫారసులు ఉండాలని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దేవరపల్లి సురేష్,లింగాల రవీంద్రబాబు లు పేర్కొన్నారు .ఈ మేరకు విడుదల చేసిన పత్రిక ప్రకటనలో నేతలు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగులకు 12వ పిఆర్సి కమిషన్ నియమించటాన్ని స్వాగతిస్తూ అసోసియేషన్ పక్షాన హర్షం వ్యక్తం చేశారు. కారణాలు ఏమైనాప్పటికీ 11వ పిఆర్సి లో ఉద్యోగుల వేతనాలలో గతంలో ఎప్పుడూ లేని విధంగా ఎలాంటి పురోగతి లేకపోవటం వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఉద్యోగులకు జరిగిన నష్టాన్ని ఈ పిఆర్సి ద్వారా భర్తీ చేస్తారని, ప్రస్తుత పరిస్థితులు, పెరిగిన జీవన స్థితిగతులను పూర్తిగా పరిగణనలోనికి తీసుకొని డాక్టర్ మన్మోహన్ సింగ్ ఆధ్వర్యంలోని పిఆర్సి కమిషన్ మెరుగైన వేతనాలను సిఫార్సు చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగస్తులకు మధ్యంతర భతి ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఘంటసాలలో వర్ష బీభత్సం



చిట్టూరు గ్రామంలో విరిగిపడిన విద్యుత్ స్తంభం

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండల పరిధిలో మల్లాయి చిట్టూరు గ్రామంలో గురువారం తెల్లవారుజామున ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్ స్తంభం విరిగి పడిపోయింది. గ్రామంలోని ఎస్సీ కాలనీలో కుంపటి రమేష్ ఇంటి సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభం ఈదురు గాలులకు ఒక్క సారిక విరిగి పడిపోవడంతో చుట్టుపక్కల గహాల వారు భయాందోళనకు గురయ్యారు. ఈదురు గాలులకు విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో ఘంటసాల గ్రామంతోపాటు పరిసర ప్రాంతాల్లో ఉదయం 5 గంటల నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ సిబ్బంది శ్రమించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడానికి సాయంత్రం వరకు సమయం పట్టింది. భారీ వర్షం కారణంగా మల్లాయి చిట్టూరులోని పలు లోతట్టు ప్రాంతాలు వర్షపు నీటితో జలమయంగా మారాయి. మండల పరిధిలోని పలు గ్రామాలలో ఇటీవల వేసిన ఆకుమడులు పూర్తిగా వర్షంలో మునిగిపోయాయి. వ్యవసాయ సీజన్ ప్రారంభం కావటంతో రైతులు వ్యవసాయ పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. చాలా వరకు ఆకుమడులు పోసుకోగా, బారి వర్షం వచ్చి మొత్తం నీటమునిగినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి సుమారు 2 వేలు వరకు నష్టం ఉంటుందని రైతులు ఆవేదన

ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-గన్నవరం : బదిలీలపై వచ్చిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా కోశాధికారి మరీదు వరప్రసాద్, గన్నవరం మండలం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గొట్టం రవిబాబు, గుర్రం రాజబాబు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యలపై యుటిఎఫ్ ఆధ్వర్యంలో గురువారం గన్నవరం మండలంలో విస్తత ప్రచారం నిర్వహించారు. ముఖ్యంగా ప్రభుత్వం సిఫారసు పేరుతో అక్రమ బదిలీలు చేయడాన్ని వ్యతిరేకించాలని ఉపాధ్యాయులను చైతన్య పరిచారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవా లని పిలుపునిచ్చారు. తెంపల్లి, వీరపనేని గూడెం, గొల్లనపల్లి, సూరంపల్లి, కేసరపల్లి, ముస్తాబాద్ గ్రామాల్లో ఉపాధ్యా యులను కలిశారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ అక్రమ బదిలీలు వెంటనే నిలిపేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధ్యాయుల జీతభత్యాలు చెల్లించడంతో పాటు అనేక ప్రధానమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం సరికాదన్నారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీలకు సుమారు 80 వేలమంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకుంటే 52 వేల మందికి బదిలీలు జరిగాయని తెలిపారు. యుటిఎఫ్ జిల్లా నాయకులు దాసరి నవభారతి మాట్లాడుతూ సర్దుబాటు ప్రక్రియలో 137 కంటే తక్కువ విద్యార్థులున్న 505 హైస్కూళ్లలో హెచ్ఎం, పిఇటి పోస్టులను తొలగించారని చెప్పారు. అప్గ్రేడ్ చేసిన సుమారు 1,500 హైస్కూళ్ల హెచ్ఎం, పిఇటి పోస్టులు కొత్తగా ఇచ్చారని వివరించారు. విద్యాశాఖ తీవ్ర తాత్సారంతో ఉపాధ్యాయులు మరో నెలపాటు జీతాలు పొందలేని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. యుటిఎఫ్ నాయకులు రాజబాబు, రవి, జి. జేమ్స్, పద్మావతి, తాతా శ్రీనివాసరావు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధుల విజృంభణ

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులు కారణంగా సీజనల్ వ్యాధులు, వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. ఇప్పటికే డెంగ్యూ, టైఫాయిడ్, విషజ్వరాలతోపాటు డయేరియాతో పలువురు బాధితులు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు.

వర్షాకాలం వచ్చిందంటే సీజనల్ వ్యాధులతో ప్రజలు మంచాన పడటం ప్రతి ఏడాది పరిపాటిగా మారింది. వాతావరణం మారడంతో జిల్లాలో జ్వరం, జలుబు, ఫ్లూ వ్యాధులు తదితర సీజనల్ వ్యాధులు ప్రభలుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు, వాలంటీర్లు, ఏఎన్ఎంలు తరయూ ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. జ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించి వైద్య పరీక్షలు చేయిస్తున్నారు. ప్రభుత్వ సర్వేలో అక్కడఅక్కడా సాధారణ జ్వరం ఉన్నట్లు తేలుతోంది. జిల్లావ్యాప్తంగా ఉన్న ఆసుపత్రులకు సీజనల్ వ్యాధిగ్రస్తుల తాకిడి పెరుగుతోంది. ఎక్కువ మంది బాధితులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. పిల్లల ఆసుపత్రులకు కూడా తాకిడి పెరుగుతోంది. ఇప్పటి వరకు జిల్లాలో 35 డెంగ్యూ కేసులు నమోదైనట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ చెబుతోంది. జిల్లా కేంద్రం మచిలీపట్నంలో 12, పెడనలో 4 కేసులు, గుడివాడ, ఉయ్యూరు, వైఎస్సార్ తాడిగడపల్లో ఒక్కో కేసు చొప్పన నమోదయ్యాయి. మిగిలిన కేసులు గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నమోదయ్యాయి. ప్రభుత్వాస్పత్రుల్లో నిర్ధారించిన కేసులనే అధికారులు పరిగణలోకి తీసుకుంటున్నారు. ప్రయివేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో డెంగ్యూగా చెబుతూ వైద్యులు చికిత్స అందించినా వాటిని జిల్లా యంత్రాంగం పరిగణలోకి తీసుకోవడం లేదు. కొత్తగా వస్తున్న జ్వరాల్లో ఎక్కువ శాతం టైఫాయిడ్ ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. సాధారణ జ్వరాల కేసులు ఈ ఏడాది 9,094 నమోదైతే, జూలైలో ఇప్పటివరకు 534 కేసులు నమోదయ్యాయి. టైఫాయిడ్ జ్వరాలు ఈ ఏడాది ఇప్పటివరకు 704 కేసులు నమోదుకాగా, ఈనెలలో ఇప్పటివరకు 66 కేసులు, డయేరియా (అతిసార) ఈ ఏడాది ఇప్పటి వరకు 646 నమోదుకాగా, ఈ నెలలో 44 కేసులు నమోదయ్యాయి. ఇవి కేవలం ప్రభుత్వ లెక్కలు మాత్రమే. ప్రైవేట్, కార్పొరేట్, గ్రామీణ వైద్యుల వద్ద వందల సంఖ్యలో రోగులు ప్రతిరోజూ వైద్య సేవలు పొందుతున్నారు. ఎక్కువగా తాగే నీటి ద్వారానే ఇవి సోకుతున్నట్లు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సి ఉంది. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కాచి చల్లార్చిన నీటిని తాగడం ద్వారా వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.

మొదటిపేజీ తరువాయి

ప్రజానేత ఆర్‌కె

నుండి శుక్రవారం ఉదయం 10 గంటలకు అంతిమయాత్ర ప్రారంభమవుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

పార్టీ, కార్మిక, ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు

ఆర్.కోటేశ్వరరావు మృతి పట్ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు సంతాపం తెలిపారు. రాష్ట్ర కమిటీ తరపున విప్లవ జోహార్లర్పించారు. కార్మిక నేతగా, సిపిఎం నాయకుడిగా విజయవాడ నగరంలో ప్రముఖమైన పాత్ర నిర్వహించారని పేర్కొన్నారు. పార్టీకి, ప్రజా, కార్మిక ఉద్యమాలకు గుర్తింపు తెచ్చారని బాబూరావు కొనియాడారు. కుటుంబ సభ్యులను పార్టీ, ప్రజాసంఘాలలో భాగస్వాములను చేశారని గుర్తుచేశారు. కోటేశ్వరరావు మతి పార్టీ, కార్మిక, ప్రజా ఉద్యమాలకు తీరనిలోటని పేర్కొన్నారు.

ప్రజా ఉద్యమాలకు జీవితం అంకిత

సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ సంతాపం

ఆర్.కోటేశ్వరరావు మతి బాధాకరమని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ పేర్కొన్నారు. ఆయన ఆకస్మిక మృతి వార్త విన్న వెంటనే పార్టీ శ్రేణులు యావత్తు దిగ్భ్రాంతికి గురయ్యాయని తెలిపారు. కామ్రేడ్ 'ఆర్‌కె'గా అందరూ ఆప్యాయతతో పిలుచుకునే కోటేశ్వరరావు ప్రజా ఉద్యమాల్లో మమేకమయ్యారని కొనియాడారు. చిన్ననాటి నుండి కమ్యూనిస్టు భావాలతో ప్రజల సమస్యలపై నిరంతరం ఉద్యమించారని తెలిపారు. సిపిఎం జిల్లా కమిటీ తరపున ప్రగాఢ సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాద్, కె.శ్రీదేవి తదితరులు ఆర్‌కె మృతి పట్ల తీవ్ర సంతాపం తెలిపారు.

పలువురు నేతల నివాళి

సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్ రఘు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్ కుమార్, ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ ఆల్ ఇండియా నాయకులు ముజఫర్ అహ్మద్, బెఫి రాష్ట్ర నాయకులు ఆర్.అజయ్‌కుమార్, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు సిహెచ్.వి.రెడ్డయ్య, సిపిఎం సెంట్రల్, పశ్చిమ సిటీల కార్యదర్శులు భూపతి రమణారావు, బోయి సత్యబాబు, తూర్పు సిటీ నాయకులు పి.కృష్ణ తదితరులు కోటేశ్వరరావు భౌతికకాయంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతికి తీవ్ర సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. 27వ డివిజన్ కార్పొరేటర్ కె.మల్లేశ్వరి, ఎంబి విజ్ఞాన కేంద్రం బాధ్యులు యు.వి.రామరాజు, సిపిఎం నాయకులు కె.దుర్గారావు, టి.ప్రవీణ్, వై.సుబ్బారావు, పి.కష్ణమూర్తి, వెలగా శ్రీనివాసరావు, దుర్గాపురం డివిజన్ శాఖ కార్యదర్శి మల్లంపల్లి శివ, ఏం.బాలాజీ, ఎం.పరశురామయ్య, బి.చిన్నారావు, ఇవి నారాయణ, బాబూరావు, ఐద్వా నాయకులు జి.ఝాన్సీ, ఆషా, షకీల, టాక్స్‌పేయర్ అసోసియేషన్ నగర కార్యదర్శి ఎంవి ఆంజనేయులు, ఎస్‌డబ్ల్యుఎఫ్ రీజియనల్ అధ్యక్షులు సిహెచ్.పరమేశ్వరరావు, నాయకులు ఎ.దివాకర్, కొల్లూరు కోటేశ్వరరావు, పుల్లారావు తదితరులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు.

గణనీయంగానే రిజిస్ట్రేషన్లు

మొత్తం 1,34,536 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్లు చేశారు. వీటి ద్వారా స్టాంప్ డ్యూటీ కింద రూ.563.31 కోట్ల ఆదాయం సమకూరింది. అంతేకాకుండా ట్రాన్స్‌ఫర్ డ్యూటీ కింద మరో రూ.115.41 కోట్లు, రిజిస్ట్రేషన్ రుసుం కింద రూ.95.95 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి లభించింది. ఇలా అన్ని డాక్యుమెంట్లకు కలిపి గత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.774.67 కోట్ల మేర ప్రభుత్వానికి ఆదాయం సమకూరింది. ప్రోపర్టీ రిజిస్ట్రేషన్లు మ్యారేజీ రిజిస్ట్రేషన్లు, ఫర్మ్, సొసైటీస్‌తోపాటు స్పెషల్ మ్యారేజీ రిజిస్ట్రేషన్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిర్వహిస్తారు. వీటిలో ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ల ద్వారా అధికంగా ఆదాయం సమకూరుతుందని అధికారులు చెబుతున్నారు. కొత్త జిల్లాగా ఏర్పడిన అనంతరం తొలి ఆర్థిక సంవత్సరంలో చెప్పుకో దగ్గ స్థాయిలోనే రిజిస్ట్రేషన్లు జరిగాయని అధికారులు చెబుతున్నారు. అయితే ఇది వరకటితో పోలిస్తే రియల్ ఎస్టేట్ భూమ్ బాగా తగ్గింది. దీంతో విజయవాడతోపాటు నగర శివారు ప్రాంతాల్లో భూముల క్రయ, విక్రయాలు బాగా తగ్గాయి. లేకుంటే రిజిస్ట్రేషన్ల సంఖ్య బాగా పెరగడంతోపాటు ఎక్కువ మొత్తంలో ఆదాయం సమకూరేదని అధికారులు చెబుతున్నారు. అయితే ఎన్టీఆర్ జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలన్నింటిల్లోకి విజయవాడ పటమట అత్యధికంగా రిజిస్ట్రేషన్లు జరిగే కార్యాలయంగా రాష్ట్ర వ్యాప్తంగా పేరుంది. మరోవైపు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో చేపట్టే రిజిస్ట్రేషన్ల సేవలను గ్రామ స్థాయిలో అందుబాటులోకి ప్రభుత్వం తీసుకొచ్చింది. మండల, డివిజన్ల కేంద్రాల్లో ఉండే రిజిస్ట్రార్ కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేకుండానే ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా గ్రామ సచివాలయ ద్వారా సేవలను పొందేం దుకు అవకాశం కల్పించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యా లయా ల్లో అందించే ప్రభుత్వ సేవలన్నీ గ్రామ సచి వాల యాల్లో అందు బాటులోకి తెచ్చారు. అందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లాలో 14 గ్రామ సచివా లయాల ద్వారా ఈ సేవలను అందిస్తు న్నారు. గతేడాది నవంబరు నుంచి ఇక్కడ రిజి స్ట్రేషన్ల ప్రక్రియ ప్రారంభిం చారు. అప్పటి నుంచి జూన్ వరకు 601 రిజిస్ట్రే షన్లు జరగ్గా, వీటి ద్వారా రూ.1.88 కోట్ల ఆదాయం రాబట్టారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని నిరసన



నిరసన తెలుపుతున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా) : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకొని పరిష్కార చర్యలు చేపట్టాలని లేదంటే రానున్న రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం చేస్తామని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కెపి ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. ఇటీవల ప్రభుత్వం చేసిన ఉపాధ్యాయ బదిలీల్లో అనేక అక్రమాలు చోటు చేసుకున్నాయని , వాటిని సరి చేయాలని , ప్రతినెల ఒకటో తేదీని ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ యు టి ఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం యుటిఎఫ్ కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ మహేశ్వర రావు మాట్లాడుతూ తనిఖీలతో హడావుడి చేసే రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు పాఠశాలలో నెలకొన్న సమస్యలు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఎందుకు దృష్టిసారించరని ప్రశ్నించారు. ఉపాధ్యాయ బదిలీలు ఎన్నో అక్రమాలు జరిగాయని కాబట్టి వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యు టి ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.లెనిన్ బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీల్లో పారదర్శకత లోపించిందని విమర్శించారు. ఖాళీలు చూపించకుండా ఇష్టానుసారంగా బదిలీలు చేశారని దీనివల్ల అక్కడ ఖాళీ లేక ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు కాబట్టి బదిలీలను రద్దుచేసి పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల పై ఉద్దేశ పూర్వకంగా కక్ష పూరితంగా వ్యవహరిస్తుందని ఇది మంచి పద్ధతి కాదన్నారు.ఉపాధ్యాయులకు బోధ నేతర పనులు అప్పజెప్ప కుండా విద్య బొధించేందుకు అవకాశం ఇచ్చినప్పుడే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. జిల్లా అధ్యక్షులు బి కనకారావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 80 వేల మంది ఉపాధ్యాయులు బదిలీలకు దరఖాస్తు చేసుకుంటే 52 వేల మంది అవకాశాలు కల్పించారాని ఇవి కూడా సక్రమంగా జరిగిన దాఖలాలు లేవన్నారు. వీటిలో ఐదు వందల మందికి దొడ్డి దారిన బదిలీలు చేసి వారు కోరుకున్న దగ్గర ప్రాంతాలకు బదిలీ చేశారని ఆరోపించారు.ఎన్నో ఉద్యమాలు చేసి సాధించుకున్న కౌన్సిలింగ్ విధానాన్ని ఈ రోజు ప్రభుత్వం అపహాస్యం చేసిందన్నారు. మరి విద్యాశాఖ రాష్ట్ర ఉన్నతాధికారులు వీటిపై ఎందుకు దృష్టి సారించరని ప్రశ్నించారు.ప్రతి నెల సక్రమంగా వేతనాలు చెల్లించకపోవడంతో ఉపాధ్యా యులు అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కాబట్టి ప్రతినెల ఉపాధ్యాయులు వేతనాలు ఒకటో తేదీన చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉపాధ్యాయ సంఘాలన్నీ కలుపుకొని రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.బి టి ఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కైతేపల్లి దాస్ సంఘీభావం తెలిపిన ఈ నిరసన కార్యక్రమంలో యు టి ఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఎండి షౌకత్ హుస్సేన్, జిల్లా కార్యదర్శులు టి.గంగరాజు, అబ్దుల్ హబీబ్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రీసర్వే ప్రక్రియ వేగవంతం : కలెక్టర్



ట్రాక్టర్ నడుపుతున్న ఎంఎల్ఎ కైలే అనిల్‌కుమార్

ప్రజాశక్తి-కల్టరేట్ (కృష్ణా) : రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం మేరకు రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయం నుంచి సర్వే సెటిల్మెంట్ రికార్డుల కమిషనర్ సిద్ధార్ద్ జైన్ జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్ లో కలెక్టరేట్లోని తన చాంబర్ నుంచి జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, జాయింట్ కలెక్టర్ డా. అపరాజిత సింగ్ తో కలిసి పాల్గొన్నారు. జిల్లాలో జరుగుతున్న రీసర్వే పురోగతిని ఆయన కమీషనర్ కు వివరించారు. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాన్ని నిర్ణీత సమయంలో చేరుకుంటామని ఆయనకు తెలిపారు.అనంతరం కలెక్టర్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో రీసర్వే మొదటి దశలో 103 గ్రామాలలో పూర్తి చేసుకున్నామని తెలిపారు. రెండవ దశలో 62 గ్రామాలలో రీసర్వే చేపట్టగా ఆయా గ్రామాలకు గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తయ్యిందని, 23 గ్రామాలలో గ్రౌండ్ వ్యాలిడేషన్ పురోగతిలో ఉందని అన్నారు. 14 గ్రామాలకు డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్ (డీఎల్ఆర్) పని కంప్యూటర్లో జరుగుతుందని, 25 గ్రామాలకు 13వ నోటిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు నిర్దేశించిన వారాంతపు లక్ష్యాలను చేరుకోవడానికి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా సర్వే భూరికార్డుల ఇన్చార్జి ఏడి జి.రంగారావు కూడా వీడియోకాన్ఫరెన్స్ పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సర్టిఫికెట్ల అందజేత

ప్రజాశక్తి-పమిడిముక్కల : రైతుల శ్రేయస్సు కోసమే వైసిపి ప్రభుత్వం పాటుపడుతోందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. గురువారం పమిడిముక్కల మండలంలోని తాడంకి పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని 11 రకాల సేవలకు సంబంధించిన సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమ ప్రభుత్వం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తాడంకి గ్రామ సర్పంచ్ జంపాన ధనలక్ష్మి, జడ్పిటిసి సభ్యురాలు ఏనుగ వెంకటరమణ, మండల తాసిల్దార్ రాజ్యలక్ష్మి, మండల అభివృద్ధి అధికారి సుధా ప్రవీణ్, తాడంకి ఎంపిటిసి కూచిపూడి శ్రీలక్ష్మి, పరస జగన్, ముళ్ళపూడి గ్రామ సర్పంచ్ పక్కాలా అంజిబాబు, మారుపాక మహేశ్వరావు, కొడాలి రాంబాబు, కంభపు రాంబాబు, మంటాడ ఎంపిటిసి మేరుగ లక్ష్మి, పంచాయతీరాజ్ డిఇ శ్రీనివాసరావు, ఏ ఈ శరబంజరాజు, వ్యవసాయ అధికారి గణేష్‌రెడ్డి, ట్రస్టు బోర్డు మెంబర్ అలివేలు మంగ, గుడి ట్రస్ట్ బోర్డు సభ్యులు ఓడిపోయిన కోటేశ్వరావు, ఏనుగు మస్తానావు, మామిళ్ళపల్లి గ్రామ సర్పంచ్ ఆముదాలపల్లి సుబ్రహ్మణ్యం, మండల వైయస్సార్ పార్టీ అధ్యక్షులు ఎలమంచిలి గణేష్, మండల ఉపాధ్యక్షులు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి-అవినగడ్డ : మండల పరిధిలోని మోదుమూడి గ్రామంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో గృహం దగ్ధమైన మెరుగు సీతామహాలక్ష్మి కుటుంబానికి టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మండలి వెంకట్ రామ్ సహాయం అందజేశారు. గురువారం ఆ కుటుంబాన్ని పరామర్శించి వస్త్రాలు దుప్పట్లతో పాటు రూ 3 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బచ్చు రఘునాథ్, వీర రాఘవులు, గుడివాక నరహరి పాల్గొన్నారు

యార్లగడ్డకు అభినందన

ప్రజాశక్తి-ఉయ్యూరు : వైసీపీ ప్రభుత్వ అసమర్థ, అరాచక, కార్మిక, ఉద్యోగ వ్యతిరేక, అవినీతి పాలనను ఎండ గట్టి రానున్న ఎన్నికల్లో పార్టీ ఘన విజయానికి సుశిక్షితులైన సైనికుల్లా పనిచేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. టీఎన్టీ యుసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా నియమితుడైన యార్లగడ్డ రమేశ్ గురువారం రాజేంద్రప్రసాద్ను మర్యాద పూర్వకంగా కలశారు. ఈ సందర్భంగా రమేశ్‌కు శాలువా కప్పి రాజేంద్రప్రసాద్ సత్కరించారు. కార్మిక సమస్యలపై ప్రభుత్వం కళ్ళ తెరిపించేందుకు అలుపెరుగని పోరాటం చేయాలని సూచించారు. ప్రభుత్వ కార్మిక వ్యతిరేక పాలనపై పోరాటం చేస్తానని రమేశ్ హామీఇచ్చారు. తనపై నమ్మకంతో టీఎన్టీయూసీ రాష్ట్ర జనరల్ సెక్రటరీగా నియమించిన పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, రా ష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, టీఎన్టీయూసి అధ్యక్షుడు రఘురామరాజు, బోడెప్రసా ద్ రాజేంద్రప్రసాద్ కతజ్ఞతలు తెలుపుతున్నట్లు రమేశ్ పేర్కొన్నారు.

విషాదం నింపిన రోడ్డు ప్రమాదం

- దిక్కులేనివారుగా మారిన రోడ్డు ప్రమాద బాధితుల బిడ్డలు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు



మృతురాలు శ్రీలత (ఫైల్)

ప్రజాశక్తి-అవనిగడ్డ : గత ఆదివారం శ్రీకాళహస్తి సమీపంలో కండ్రి గ వద్ద రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయిన రెండు కుటుంబాలకు సంబంధించిన ముగ్గురు విద్యార్థుల వారి తల్లిదండ్రులు ఆకస్మికంగా మతి చెందడంతో దిక్కులేనివారుగా రోడ్డున పడ్డారు. చివరకు వారిని ఎవరైనా అప్పన్న హస్తం అందించి ఆదుకుంటారేమోనని ఎదురు చూడటం తప్ప వారికి మరో మార్గం కనిపించడం లేదని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే అవనిగడ్డ మండలం వేకనూరు గ్రామానికి చెందిన గుడివాడ చలపతిరావుకు ఇరువురు కుమార్తెలు కాగా, ఒక కుమార్తె శ్రీలతకు భర్త లేకపోగా ఉయ్యూరులో ఉంటూ క్రస్ పాయింట్ లో పనిచేస్తూ జీవనం సాగిస్తుంది. ఆమెకు ఒక కుమారుడు వంశీ బీటెక్ ద్వితీయ సంవత్సరం విద్యను అభ్యసిస్తున్నాడు. మరో కుమార్తె రాజ్యలక్ష్మి మోపిదేవి మండలం అరజావారిపాలెం గ్రామానికి చెందిన తుంగల రమేష్ బాబుతో వివాహం చేయగా వారు విజయవాడలోనే బాలాజీ అపార్ట్మెంట్లో నివసిస్తున్నారు. వారికి ఇరువురు కుమారులు కాగా ఒక కుమా రుడు రేవంత్ తమిళనాడులో బీటెక్ చదువుతున్నాడు. మరో కుమారుడు భరత్ ఇంటర్మీడియట్ చదువు తున్నాడు. వీరు తిరుపతి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో దారిలోని ఆలయాలను సందర్శించేందుకు వెళుతుండగా శ్రీకాళహస్తి సమీపంలో కండ్రిగ వద్ద వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని లారీ అతివేగంగా ఢీకొనడంతో అక్కడికక్కడే శ్రీలత రాజ్యలక్ష్మి రమేషులతోపాటు గుడివాడకు చెందిన మరో ముగ్గురు మతి చెందగా వారితో పాటు ప్రయాణం చేస్తున్నా రాజ్యలక్ష్మి రమేష్‌ల చిన్న కుమారుడు భరత్ గాయాలతో బతికి బయటపడ్డాడు. కాగా వంశీ తల్లి శ్రీలత, రేవంత్, భరత్ తల్లిదండ్రులు రమేష్ రాజ్యలక్ష్మి మతి చెందడంతో ఈ ముగ్గురు దిక్కులేని వారిగా మిగిలిపోయారు. భవిష్యత్తుపై ఆశతో ఉన్నత చదువులు అభ్యసిస్తున్న రేవంత్ వంశీలా చదువు కొనసాగింపు ప్రశ్నార్ధకంగా మారింది. భరత్ పరిస్థితి కూడా విషమిన్నా చిన్న వయసు కావడంతో మరింత ఆందోళనకారంగా ఉన్నట్లు బంధువులు చెబుతున్నారు. అందువల్ల దిక్కులేని వారిగా అనాథలుగా మిగిలిపోయిన వీరి పట్ల దాతలు ఎవరైనా దయచూపి వారు చదువుకునేందుకు సహాయ సహకారాలు అందించాలని బంధువులు కోరుతున్నారు. కాగా శ్రీలత రాజ్యలక్ష్మి తల్లిదండ్రుల పరిస్థితి కూడా అంతంత మాత్రమే అయినందువల్ల వీరిని ఆదుకునే దాతలు కోసం ఎదురుచూస్తున్నారు. ఎవరైనా స్పందించి వారి చదువు సాగించే కొనేందుకు సహాయ సహకారాలు అందించాలని కోరుతున్నారు

గాయపడిన కార్మికురాలిని ఆదుకోవాలి



ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ (గన్నవరం) : ఏలూరు జిల్లా నూజివీడు మండలం మీర్జాపురం గ్రామంలో ఉన్న సిపి కంపెనీలో పని చేస్తూ గాయపడి విజయవాడ నాగార్జున ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాపులపాడు ఎంజీ నగరకు చెందిన షేక్ షహనాజ్ బేగం అనే కార్మికురాలిని గురువారం సిఐటియు నాయకులు బేతా శ్రీనివాసరావు, రైతు సంఘం నాయకులు తోట సాంబశివరావు, ఏలూరు జిల్లా రైతు సంఘం నాయకులు నిమ్మగడ్డ నరసింహారావు, బాపులపాడు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అబ్దుల్ బారి పరామర్శించారు. బాధితురాలిని కంపెనీ యాజమాన్యం ఆదుకోవాలని కోరారు. కంపెనీల్లో పని చేసే కార్మికులకు ఏ ఆపద వచ్చిన సిఐటియు అండగా నిలుస్తుందని తెలియజేశారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డును కొనసాగించాలని నిరసన

ప్రజాశక్తి - గుడివాడ : భవన నిర్మాణ కార్మిక సంఘం సంక్షేమ బోర్డుని కొనసాగించాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్య క్షులు రేపాని కొండ డిమాండ్ చేశారు. కృష్ణా జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం ఇచ్చిన పిలుపుమేరకు ఈ 14వ తేదీన గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానికి వినతిపత్రం ఇవ్వాలని నీలామహల్ సెంటర్లో భవన నిర్మాణ కార్మికులు నిరసన చేయడం జరిగింది. ఈ సందర్భంగా రేపాని కొండ మాట్లాడుతూ వైఎస్ఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ కార్మిక సంఘం సంక్షేమ బోర్డుని ఆపేయడం జరిగిందన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డుని కొనసాగించాలని పెండింగ్ లో ఉన్న క్లైమ్ లను రిలీజ్ చేయాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుడికి బతికున్నంత కాలం సంక్షేమ బోర్డు పథకాలను అమలు చేయా లన్నారు. శుక్రవారం జరిగే కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మికులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. బండి శీను, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

'భవిష్యత్తు గ్యారెంటీ' యాత్రను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి కోడూరు : తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భవిష్యత్తుకు గ్యారెంటీ బస్సు యాత్ర శనివారం అవనిగడ్డ నియోజకవర్గానికి చేరుకుంటుందని, బస్సు యాత్రలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్ పిలుపునిచ్చారు. గురువారం కోడూరు మండల తెలుగుదేశం పార్టీ సమావేశం మండలపార్టీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన మండలి వెంకట్రామ్ మాట్లాడుతూ శనివారం ఉదయం 9 గంటలకు ఘంటసాల మండలం శ్రీకాకుళం లోని శ్రీకాకుళేశ్వరస్వామి దేవాలయంలో పూజల అనంతరం ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ, మీదుగా కోడూరు మండలానికి చేరుకుం టుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మద్దూరి కాంతారావు, బడే భావన్నారాయణ, తోట రాంబాబు, పుతకోయిన శ్రీనివాసరావు, పిల్లి మల్లి ఖార్జునరావు, ఉప్పాల పోతురాజు, వేములపల్లి శ్రీకృష్ణ, అద్దంకి పాండురంగారావు పాల్గొన్నారు.

వీరమ్మకు వైభవంగా ఆషాడం సారె

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు కొలిచిన భక్తుల కొంగు బంగారమైన ఉయ్యూరు వీరమ్మ తల్లికి గురువారం ఆలయక మిటీ, భక్తుల ఆధ్వర్యంలో వైభంగా ఆషాడ సారె సమర్పించారు. ప్రధాన రహదారిపై ఉన్న ఆలయం నుండి వందలాది మహిళలు, భక్తులు పసుపుకుంకుమ, చీర, వివిధ రకాల పండ్లతో బయలుదేరి మేళ తాళాలు, మహిళా భక్తుల కోలాటాలు, టపాసులు కాల్చుతూ ఊరేగింపుగా రావిచెట్టు సెంటర్ సమీపాన ఉన్న అమ్మవారి మెట్టినింటికి చేరుకుని సారె సమర్పించారు. భక్తులు పెద్దయెత్తున ఊరేగింపులో పాల్గొని అమ్మవా రికి సారె అందజేశారు.

డాక్టర్ విజిఆర్‌కు నాటా పురస్కారం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఇటీవల అమెరికాలోని డల్లాస్ నగరంలో అత్యంత వైభవంగా జరిగిన నాటా-2023 వేడుకల్లో విజయవాడ నగరానికి చెందిన ప్రముఖ మధుమేహ వైద్య నిపుణులు డాక్టర్ కె.వేణుగోపాలరెడ్డి(వీజీఆర్)కు అరుదైన నాటా పురస్కారం లభించింది. ఈ సందర్భంగా గురువారం మొగల్రాజపురంలోని డాక్టర్ వీజీఆర్ డయాబెటిస్



హాస్పటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గడిచిన 17 సంవత్సరాలకు పైగా మధుమేహ వ్యాధి నియంత్రణ, నివారణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తూ చైతన్యం తీసుకొస్తున్నట్లు తెలిపారు. వ్యాధి నియంత్రణ కోసం తెలుగు, ఇంగ్లీషు భాషల్లో డాక్టర్ వీజీఆర్ డయాబెటీస్ అట్లాస్ పేరిట ప్రత్యేక పుస్తకాన్ని రూపొందించినట్లు చెప్పారు. వీజీఆర్ ట్రస్టు నుంచి ఇప్పటివరకు దాదాపు ఎనిమిది లక్షల పుస్తకాలను వివిధ వర్గాల ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశామన్నారు.

పిఎంజె సితార కలెక్షన్స్ ప్రదర్శన

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: పిఎంజె జ్యూవెల్స్ వారి




వివాహ ఆభరణాల సితార కలెక్షన్స్‌ను గురువారం నగర ప్రముఖులు దేవినేని అనుపమ నగరంలోని హొటల్ గేట్‌వేలో జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివాహాలు, శుభకార్యాల సందర్భంగా ప్రత్యేకంగా ఆభరణాలతో కూడిన కలెక్షన్స్‌ను పిఎంజె జ్యూవెల్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ ప్రదర్శన ఈ నెల 15వ తేదీ వరకు ఉంటుందని తెలిపారు.

రక్తహీనతపై అవగాహన

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: రక్తహీనతపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో పి అండ్ హెల్త్ సంస్థ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మిలింద్ థాటే ఒక ప్రకటనలో తెలిపారు. ద ఫెడరేషన్ ఆఫ్ ఆబ్స్టెట్రిక్ అండ్ గైనకాలజికల్ సొసైటీ ఆఫ్ ఇండియా సహకారంతో బస్సు యాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రక్తపోటు పరీక్షలతో పాటు రెండు వేల మందికిపైగా వ్యక్తులకు ఉచితంగా గైనకాలజిస్టు, పిజీషియన్ ద్వారా స్క్రీనింగ్ పరీక్షను అందించడమే ధ్యేయంగా యాత్ర కొనసాగుతుందన్నారు.

చంద్రయాన్-3పై అవగాహన

ప్రజాశక్తి-హెల్త్‌యూనివర్శిటీ: చంద్రుని ఉపరితలంపై విజయవంతమైన సాఫ్ట్ ల్యాండింగ్ సాధించిన నాల్గవ దేశంగా భారత్ అవతరించిందని ఆంధ్రా లయోలా కళాశాల ఫిజిక్స్ ఉపాధ్యాయులు డాక్టర్ తుమ్మల శ్రీకుమార్ అన్నారు. ఆంధ్రా లయోలా కళాశాలలో ఫిజిక్స్ విభాగం ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఫిజిక్స్ టీచర్స్ సహకారంతో 'చంద్రయాన్ -3 యొక్క శాస్త్రీయప్రాముఖ్యత అనువర్తనాలు' అనే అంశంపై



గురువారం సెమినార్ జరిగింది. శ్రీకుమార్ మాట్లాడుతూ ఈ మిషన్ ల్యాండర్, రోవర్‌ను కలిగి ఉంటుందని ఇది చంద్రుని యొక్క నిర్దేశించని దక్షిణ ధ్రువాన్ని అన్వేషించే లక్ష్యంలో ఉందన్నారు. సౌర వ్యవస్థ యొక్క మూలం యొక్క రహస్యాలను ఆవిష్కరించడం, చంద్రునిపై మంచు రూపంలో నేటి ఉనికిని పరిశోధించడం ఈ మిషన్ యొక్క ప్రాథమిక లక్ష్యాలలో ఒకటన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రెవరెంట్ యం.టి. ప్రభు, ఐఎపిటి ఎపి సెక్రటరీ డాక్టర్ జి.సహా భాస్కరన, కళాశాల ఫిజిక్స్ విభాగాధిపతి పి.శ్రీనివాస్ శాస్త్రి, డాక్టర్ ఎం.సి.రావు, డాక్టర్ సి.హెచ్. శ్రీనివాసరావు, డాక్టర్ పి.వి.ఎస్. ఈకార్యక్రమంలో సాయిరాం, వై.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని ఉపాధ్యాయుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

ఉపాధ్యాయుల జీతాలు చెల్లించుటకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్‌టిఆర్ జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్ద ఎన్‌టిఆర్ జిల్లా యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నిరసన కార్యక్రమం జరిగింది. ఈనిరసన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని వెంటనే జీతాలు చెల్లించాలని...ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈసందర్భంగా యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు కె.శ్రీనివాసరావు, ఏ.సుందరయ్య మాట్లాడుతూ గత నెలలో బదిలీ అయిన ఉపాధ్యాయుల, పదోన్నతి పొందిన ఉపాధ్యాయ వివరాలు హైస్కూల్ ప్లస్ 2 ప్రమోషన్స్‌పై వెళ్లిన ఉపాధ్యాయుల క్రేడర్ వివరాలు డిఇవో నుండి డిటిఓ ద్వారా సబ్ ట్రెజరీలకు రాలేదన్నారు. దీని వల్ల బదిలీ అయిన ఉపాధ్యాయుల జీత భత్యాలు చేయుటకు ఆటంకం ఏర్పడిందన్నారు. దీనికి సంబంధించిన ఉపాధ్యాయుల వివరాలు వెంటనే పంపుటకు అవసరమయ్యే చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. ఉపాధ్యాయులకు జీతాలకు సంబంధించిన బిల్స్ నేటికీ చేయకపోవడం వల్ల టీచర్స్ కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురి కావాల్సి వచ్చిందన్నారు. వెంటనే అధధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సాదారణ బదిలీ ముందు, వెనుక ప్రభుత్వం దొడ్డిదారిన అక్రమ బదిలీలు చేయడం జరిగిందని అక్రమ బదిలీలు వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. సీనియర్ ఎంఈవోలకు జీతాలు డ్రా చేయు అధికారాలు ఇచ్చి వెంటనే జీతాల సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.పి. మనోహర్ మాట్లాడుతూ గత నెలలో బదిలీలు జరిగినా నేటికీ ఆయా వివరాలు విద్యాశాఖ నుండి ట్రెజరీ డిపార్ట్‌మెంట్‌కు పంపడంలో అధికారుల నిర్లక్ష్యాన్ని తప్పుపట్టారు. రాష్ట్ర, జిల్లా అధికారులు వెంటనే స్పందించి జీతాలు ఇచ్చుటకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డి.హరిప్రసాద్, ఉపాధ్యక్షులు కృష్ణ, రాష్ట్ర కౌన్సిలర్ పాలకొల్లు శ్రీనివాసరావు, విజయవాడ సిటీ నాయకులు సుబ్బారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పి.లీల, కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, విజయవాడ ప్రధాన కార్యదర్శి అల్లిక నరసింహారావు, షరీఫ్, అనంత్ వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎన్‌టిఆర్ జిల్లా విద్యాశాఖాధికారి సి.వి.రేణుకకు వినతిపత్రం అందచేశారు.

పండ్ల తోటల పెంపకంతో అధిక లాభాలు : కలెక్టర్



చంద్రాలలో మామిడి మొక్కను నాటుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-మైలవరం: ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల అభివృద్ధి పనులను సద్వినియోగం చేసుకొని రైతులు లాభాలు పొందాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. మండలంలోని చంద్రాల గ్రామంలో గురువారం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పండ్ల తోటల పెంపకంలో భాగంగా గుణదల పరిశుద్ధం రైతు పొలంలో కలెక్టర్ ఢిల్లీ రావు మామిడి మొక్కలను నాటే పనులను ప్రారంభించారు. అక్కడకు వచ్చిన రైతులతో మాట్లాడి వారి సందేహాలను నివత్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్ల తోటల సాగుతో తక్కువ పెట్టుబడితో రైతులు అధిక లాభాలు పొందవచ్చన్నారు. పండ్ల తోటల సాగుతో పాటు వేరుశనగ, మినుము, పెసర, కూరగాయలు వంటి అంతర్ పంటలను వేసుకొని అదనపు ఆదాయాన్ని పొందవచ్చు అన్నారు. ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకంపై రైతులకు అవగాహన ఉండాలన్నారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పండ్ల రకాలకు ప్రాధాన్యత ఇచ్చినట్లయితే రైతులకు మేలు కలుగుతుందని, వాతావరణ సమతుల్యత, ఆహ్లాదకర పరిసరాలను నెలకొల్పడంలో మొక్కల పెంపకం ప్రధాన పాత్ర వహిస్తుందన్నారు. రైతుల ఆదాయం పెంచేందుకు పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. గ్రామ సర్పంచ్ జొన్నలగడ్డ జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ జే సునీత, ఎంపీడీవో లక్ష్మీ కుమారి, తాసిల్దార్ శ్రీనివాస్, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు జొన్నలగడ్డ గంగాధర్‌రావు, ఏపీడి వెంకటేశ్వరరావు, వ్యవసాయ ఉపాధి హామీ పంచాయతీరాజ్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమాధాన్ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ ఆయిల్ ఫామ్ వ్యాపారం విస్తరించే క్రమంలో నూతనంగా సమాధాన్ కేంద్రాన్ని ప్రారంభించినట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బుర్జెస్ గోద్రెజ్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే రైతుల కోసం వివిధ ప్రాంతాలలో సమాధాన్ కేంద్రాలను ప్రారంభించామని ప్రస్తుతం ఆరో కేంద్రాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా వ్యాపార కార్యకలాపాలకు, ఉపాధి అవకాశాలకు తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. అలాగే రైతులకు ఆధునికంగా జరుగుతున్న వ్యవసాయ పద్ధతులను కూడా తెలియజేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఆంధ్ర మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మొగల్‌రాజపురంలోని విఎంసి స్పెషల్ ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు గురువారం పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను అందచేశారు. ఈకార్యక్రమంలో ఆంధ్ర మోటార్ మర్చంట్స్ అసోసియేన్ అధ్యక్షులు వి.కోటేశ్వరరావు, ప్రధానకార్యదర్శి ఎస్.చంద్రశేఖర్, కోశాధికారి ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంస్థ స్కూల్‌ను దత్తత తీసుకుని ప్రతి ఏటా విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు వై.సుబ్బారావు, సభ్యులు సయ్యద్ వలి బాష, బాలసీతారామ సాంబశివరావు స్కూల్ ప్రధానోపాధ్యాయులు కె.నాగరాజు, ఆర్.మణిబాబు పాల్గొన్నారు.



ఆస్టర్ రమేష్ అమరావతిలో అరుదైన శస్త్రచికిత్స



ప్రజాశక్తి-తిరువూరు: ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగికి అరుదైన శస్త్రచికిత్స చేసి పునర్జన్మ ఇచ్చారు తిరువూరులోని ఆస్టర్ రమేష్ అమరావతి ఆసుపత్రి వైద్యులు. ఏలూరు జిల్లా విజయరాయి గ్రామానికి చెందిన అడపా సూర్యచంద్రరావు తమ్ముడుతో కలిసి విస్సన్నపేట మండలం పుట్రేల ఏరియాలో కొబ్బరి చెట్లు ఎక్కి కాయలు కోయటానికి వచ్చారు. చంద్రరావు చెట్టు ఎక్కుతుండగా పక్కనే ఉన్న విద్యుత్ తీగ తగలడంతోయ చెట్టు మీద నుంచి కింద పడిపోయాడు. మెడ, వెన్నెముకకు దెబ్బ తగిలి ప్రాణాపాయ స్థితిలో అతన్ని ఆస్టర్ రమేష్ అమరావతి ఆసుపత్రికి తరలించారు. అత్యంత క్లిష్టమైన వెన్నెముక శస్త్రచికిత్సను సీనియర్ వైద్యులు కెవిఆర్ కిషోర్, నెక్కలపు కృష్ణచైతన్య, కావ్య కోనేరు, మణి మేఘన నాలుగు గంటలు శ్రమించి విజయవంతంగా పూర్తి చేశారు. ఇటువంటి ఆపరేషన్‌ను ఈ ప్రాంతంలో మొట్టమొదటిసారిగా విజయవంతం చేయడం ఎంతో సంతోషంగా ఉందని ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు అన్నారు. చైర్మన్ కోనేరు వెంకట కృష్ణన్ మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలకు అత్యవసర వైద్యం అందుబాటు ధరల్లో అన్నివేళలా అందజేయాలనే ఉద్దేశంతో సూపర్ స్పెషాలిటీ వైద్యాన్ని అత్యంత అధునాతన వైద్య పరికరాలతో అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు.



రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి - మచిలీపట్నం రూరల్ : బందరు మండలం బైరాగిపాలెం సమీపంలో గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. బైరాగిపాలెం గ్రామానికి చెందిన పల్లబోతు వీరాస్వామి మచిలీపట్నంలో పాలు విక్రయించి ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఎదురుగా వస్తున్న బుల్లెట్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. బుల్లెట్‌పై వస్తున్న పెడన మండలం జింజేరు గ్రామానికి చెందిన పామర్తి వెంకటేశ్వరరావు తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మతి చెందాడు. బందరు రూరల్ ఎస్ఐ చాణుక్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలింత మృతిపై నందిగామలో ఆందోళన

ప్రజాశక్తి-నందిగామ

వైద్యుల నిర్లక్ష్యంతో బాలింత మతిపై నందిగామలో కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. నందిగామ ప్రభుత్వ ఆసుపత్రిలో మాగల్లు గ్రామానికి చెందిన బొజ్జగాని వెంకటేశ్వరమ్మ బుధవారం ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మరణించడంతో బంధువులు మతదేహంతో నందిగామ ఏసీపీ కార్యాలయం ఎదుట బంధువులు ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నందిగామ ప్రభుత్వాసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం వల్లనే తన భార్య మృతిచెందిందని భర్త చంద్రశేఖర్, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగడంతో నందిగామ సిఐ హనీష్, వైద్యులు, ఆస్పత్రి అభివద్ధి కమిటీ సభ్యులు చర్చలు జరిపారు.

